ANN తెలుగు

Follow: @ANNTELUGU

08-08-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 216   పేజీలు-08   వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM




## జీఎస్టీ ఆదాయానికి ఏఐతో కొత్త దిశ

- జీఎస్టీ ఆదాయానికి ఏఐతో కొత్త దిశ
- సాంకేతికతతో పన్నుల లీకేజీలకు అడ్డుకట్ట లక్ష్యం
- రాబడి పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

02

**ఏపీలో మరో డిఎస్సీ** అక్టోబర్‌లో నోటిఫికేషన్ 02





# రైతుబంధుపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు సంచలనం

- 'పేదలకే సంక్షేమం అందాలని హైకోర్టు స్పష్టం.
- 'ప్రభుత్వ విధానాలపై న్యాయస్థానం ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు వంటి సంక్షేమ పథకాల లక్ష్యం నిజమైన అర్హులకు ప్రయోజనం చేకూర్చడమేనని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కోటీశ్వరులు సైతం అలాంటి పథకాల లబ్ధిదారులుగా మారుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాధనం అత్యంత అవసరమైన నిరుపేదలు, అర్హులైన రైతులు, నిజమైన లబ్ధిదారుల సంక్షేమం కోసం వినియోగించాల్సి ఉండగా, ఆర్థికంగా బలమైన వర్గాలకు కూడా అదే ప్రయోజనం అందడం ప్రభుత్వ సంక్షేమ విధానాల అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నగేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతుబంధు పథకం మంచి సంక్షేమ కార్యక్రమమే అయినప్పటికీ, దాని అమలులో అర్హత ప్రమాణాలు మరింత కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి సూచించారు. ఆర్థికంగా అత్యంత బలమైన కోటీశ్వరులు కూడా ప్రభుత్వ నిధులను పొందుతున్న పరిస్థితి సమంజసం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అవసరమైన కుటుంబాలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. అనర్హులు ప్రభుత్వ ఉచిత పథకాల లబ్ధిని పొందడం వల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిధులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో వాటిని అత్యంత అవసరమైన వారికి మాత్రమే అందించేలా విధానాలను రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొంది. అర్హత లేని వ్యక్తులకు సంక్షేమ ప్రయోజనాలు అందడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడటమే కాకుండా, నిజమైన పేదలకు అందాల్సిన సహాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా కోర్టు ధిక్కరణ కేసుల పెరుగుదలపై కూడా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు, విధానపరమైన లోపాల కారణంగా ఉన్నతాధికారులు పదేపదే కోర్టుల ఎదుట హాజరుకావాల్సి వస్తోందని, ఇది పరిపాలనా వ్యవస్థకు ఏమాత్రం ఆరోగ్యకరమైన పరిస్థితి కాదని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. అధికారులను కోర్టుకు రప్పించడం న్యాయస్థానానికీ బాధాకరమేనని, అయితే ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిపై అనేక కోర్టు ధిక్కరణ కేసులు నమోదై ఉండటం కూడా ఈ సమస్య తీవ్రతను సూచిస్తోందని కోర్టు గుర్తుచేసింది. ప్రభుత్వ తప్పిదాల వల్ల అధికారులు వ్యక్తిగతంగా న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం విచారకరమని పేర్కొంది. పరిపాలనా వ్యవస్థలో స్పష్టమైన విధానాలు, సమయపాలన, కోర్టు ఆదేశాల పట్ల బాధ్యతాయుతమైన వైఖరి లేకపోతే ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతూనే ఉంటాయని హెచ్చరించింది. సంక్షేమ పథకాల అమలులో సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత, అర్హత నిర్ధారణలో కఠిన ప్రమాణాలు, లబ్ధిదారుల ఎంపికలో సమగ్ర పరిశీలన తప్పనిసరిగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా రైతుబంధు వంటి పథకాల విషయంలో కోటీశ్వరులు, ఆర్థికంగా స్వయం సమృద్ధి కలిగిన వ్యక్తులు లబ్ధి పొందకుండా ప్రభుత్వం విధానాలను పునఃసమీక్షించాలని అభిప్రాయపడింది. నిజమైన నిరుపేదలు, చిన్న, సన్నకారు రైతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యమని, ఆ లక్ష్యం నెరవేరేలా సంక్షేమ విధానాలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాధనం ప్రతి రూపాయి అర్హులైన పౌరుల సంక్షేమానికే వినియోగించబడేలా ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని న్యాయస్థానం సూచిస్తూ విచారణను కొనసాగించింది.

# ఏపీలో మరో డీఎస్సీ .. అక్టోబర్ లో నోటిఫికేషన్

- డిసెంబర్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్షలు నిర్వహణ.
- నిరుద్యోగులకు స్కూల్ విద్యాశాఖ శుభవార్త.

AP DSC NOTIFICATION

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ శుభవార్త తెలిపింది. వచ్చే అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో నియామక పరీక్షలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా ప్రకటించారు. డీఎస్సీ2025 నియామక ప్రక్రియపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మెగా డీఎస్సీ2025 ద్వారా మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు తమీమ్ అన్సారియా తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో అత్యంత పారదర్శకంగా నియామక ప్రక్రియ నిర్వహించినప్పటికీ, గత కొన్ని నెలలుగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల అమలుపై ఇప్పటికే ఉన్నతాధికారులు సమగ్ర వివరణ ఇచ్చారని, అయినప్పటికీ కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కమిషనర్ అన్నారు. డీఎస్సీ2025లో ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించేలా పోస్టులు చేయడం బాధాకరమని, ఎంపికైన అభ్యర్థులపై పాఠశాల విద్యాశాఖ గర్వపడుతోందని చెప్పారు. వారికి ప్రభుత్వం, విద్యాశాఖ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని తమీమ్ అన్సారియా సూచించారు. తమ లక్ష్యంపై దృష్టి సారించి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు. అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించే అంశాన్ని మరోసారి స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, స్పోర్ట్స్ కోటా కింద ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ కూడా నిబంధనల ప్రకారమే కొనసాగుతోందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, ఎండీ భరణి తెలిపారు. అన్ని క్రీడా సంఘాలు, ఫెడరేషన్ల నుంచి పూర్తి వివరాలు సేకరించి, ప్రతి అభ్యర్థి సర్టిఫికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రాథమిక ప్రాధాన్యత జాబితాను సిద్ధం చేసి విద్యాశాఖకు పంపినట్లు వెల్లడించారు. డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు స్పష్టం చేశారు.

# వైజాగ్ రైల్వే జోన్‌కు రికార్డు స్థాయి పురోగతి

- రైల్వే అభివృద్ధికి వేల కోట్లతో భారీ ప్రాజెక్టులు.
- ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల విస్తరణకు కేంద్రం వేగం.

**ఢిల్లీ, మహా:** విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే (ఎస్‌సీఓఆర్) జోన్ అతి తక్కువ కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. వార్షికంగా రూ.2,493 కోట్ల ఆదాయం నమోదు చేసి దేశంలోని కొత్త రైల్వే జోన్లలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన జోన్‌గా నిలిచిందని పేర్కొంది. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం రూ.54 వేల కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో అమలు చేయనున్న మరో రూ.71 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ తెలిపింది. విశాఖపట్నం రైల్వే యార్డు ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించింది. గుంతకల్-బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపిన కేంద్రం, విజయవాడ డివిజన్ పరిధిలో రైల్వే అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఐదు కొత్త రైల్వే మార్గాలతో పాటు 24 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించింది. రైళ్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపిన కేంద్ర రైల్వే శాఖ, ఇప్పటికే 100 లోకోమోటివ్‌లలో స్వదేశీ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్'ను అమర్చినట్లు పేర్కొంది. 2026 చివరి నాటికి తొలి 100 కిలోమీటర్ల రైల్వే మార్గంలో కవచ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వెల్లడించింది. విశాఖపట్నం రైల్వే యార్డు పునర్నిర్మాణంలో భాగంగా ఆరు కొత్త ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. తిరుపతి రైల్వే స్టేషన్‌లో భక్తుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు రూ.20 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొంది. రైల్వే ప్రమాదాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ) నిర్మిస్తున్నట్లు వెల్లడించింది. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇప్పటికే సమగ్ర సమీక్షలు పూర్తి చేసినట్లు తెలిపింది. రాయనపాడు, మంగళగిరితో పాటు రాష్ట్రంలోని 70కు పైగా రైల్వే స్టేషన్లను 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద ఆధునికీకరిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ పేర్కొంది. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్‌లో 'స్లీపింగ్ పాడ్స్', విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 'డెక్కన్ ఛాయ్' వంటి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది.

# జీఎస్టీ ఆదాయానికి ఏఐతో కొత్త దిశ

- సాంకేతికతతో పన్నుల లీకేజీలకు అడ్డుకట్ట లక్ష్యం
- రాబడి పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల లీకేజీలను అరికట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థను అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులభతర వాణిజ్య వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన సంస్కరణలు, ఆదాయ వనరుల విస్తరణ, జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. జీఎస్టీ అధికారులకు ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పన్నుల అంచనా, పర్యవేక్షణ, విశ్లేషణ మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల వ్యాపారాలకు ఆటంకాలు కలగకుండా, అదే సమయంలో ప్రభుత్వ ఖజానాకు రాబడి పెరిగేలా వ్యవస్థను రూపొందించాలని అరవింద్ సుబ్రమణియన్ సూచించినట్లు సమావేశంలో చర్చించారు. పన్నుల లీకేజీల నివారణలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో పన్ను ఎగవేతను అరికట్టేందుకు మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని ఏఐ ఆధారిత సమగ్ర వేదికపై అనుసంధానం చేయాలని ఆదేశించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే అవసరమయ్యే నిర్మాణ సామగ్రి వివరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని సీఎం సూచించారు. ఆ సమాచారంతో పాటు మీసేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రభుత్వ సేవలకు సంబంధించిన డేటాను కూడా సమీకరిస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని పన్నుల సంస్కరణలు, సాంకేతిక ఆధారిత పాలనపై చర్చించారు.

# పోలవరం నిర్మాణంపై కేంద్రం కీలక ప్రకటన

- 2027 జూన్ నాటికి తొలి దశ పూర్తి లక్ష్యం.
- నిధులు ఫేజ్-1కే.. పనులు ఎఫ్ఆర్ఎల్ వరకు



**ఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా భావిస్తున్న పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో కీలక వివరాలను వెల్లడించింది. ప్రాజెక్టు తొలి దశ (ఫేజ్ 1) కింద కేంద్రం అందించే ఆర్థిక సహాయం 41.15 మీటర్ల నీటి నిల్వ మట్టం వరకు మాత్రమే వర్తించినప్పటికీ, ప్రధాన ఆనకట్టకు సంబంధించిన సివిల్ నిర్మాణ పనులు పూర్తి స్థాయి జలాశయ మట్టం (ఎఫ్ఆర్ఎల్) అయిన 45.72 మీటర్ల ఎత్తు వరకు చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. లోక్‌సభలో వైఎస్సార్సీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులను 2027 జూన్ నాటికి పూర్తి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా అవసరమైన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రధాన డ్యామ్‌లోని గ్యాప్1, గ్యాప్2 నిర్మాణ పనులతో పాటు భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) కార్యక్రమాలను కూడా 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. 2023 ధరల ప్రకారం పోలవరం ఫేజ్1 (41.15 మీటర్ల ఎలివేషన్) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.30,436.95 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ఇందులో ఇంకా రూ.12,157.53 కోట్ల గ్రాంట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.5,512.40 కోట్లు, 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.2,810.22 కోట్లను ఇప్పటికే విడుదల చేసినట్లు లోక్‌సభకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్ ఫేజ్ 1 పరిధిలోని భూసేకరణ, పునరావాసం, కుడి, ఎడమ ప్రధాన కాలువల నిర్మాణానికి మాత్రమే వర్తిస్తుందని, అయితే ప్రధాన ఆనకట్టకు సంబంధించిన సివిల్ నిర్మాణం 45.72 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ స్థాయి వరకు చేపట్టడం కూడా అదే ప్రణాళికలో భాగమని స్పష్టం చేశారు. పోలవరం హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ వ్యయాన్ని మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రాజెక్టు నిధుల వినియోగానికి సంబంధించి అవసరమైన సాంకేతిక నివేదికలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీలు) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సకాలంలో సమర్పిస్తోందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వ్యవహరిస్తోందని కేంద్రం ప్రశంసించింది.

# జలకళతో మురిసిపోతున్న రైతన్న

- శ్రీశైలానికి పోటెత్తిన భారీ వరద నీరు.
- కృష్ణా గోదావరి బేసిన్లలో అద్భుత జలకళ.
- ఎగువ వరదలతో రాష్ట్ర జలాశయాలకు ఊరట.
- ప్రాజెక్టులకు పోటెత్తిన మహోగ్ర వరద ప్రవాహం.



**హైదరాబాద్, మహా:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. అన్నదాతల ఆశలను సజీవంగా ఉంచుతూ ఎగువ రాష్ట్రాల నుంచి జలసిరి ఉరకలెత్తుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వరుణుడు కరుణించి కురిపిస్తున్న భారీ వర్షాలతో మన రాష్ట్రాల్లోని జలాశయాలకు సరికొత్త ప్రాణం పోసినట్లయింది. ఎగువ ప్రాంతాల నుంచి ఉరకలు వేసుకుంటూ వస్తున్న మహోగ్ర వరద నీటితో కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకుని నయనానందకరంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ వర్షపాతం లోటులో ఉన్నప్పటికీ, ఈ వరద ఉద్ధృతి సాగు, తాగునీటి అవసరాలకు ఎనలేని ఊరటనిస్తోంది.

**కృష్ణమ్మ ఉగ్రరూపం.. జూరాల నుంచి శ్రీశైలానికి జలగండి**

కృష్ణా బేసిన్‌లో జల ప్రవాహం హోరెత్తుతోంది. జూరాల ప్రాజెక్టుకు వరద నీరు భారీగా పోటెత్తుతుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ప్రస్తుతం జూరాలకు ఏకంగా 2.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటం గమనార్హం. ప్రాజెక్టు 28 గేట్లను ఎత్తివేసి సుమారు 1.88 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు సగర్వంగా విడుదల చేస్తున్నారు. దీనికి తోడు విద్యుదుత్పత్తి అనంతరం మరో 28 వేల క్యూసెక్కులకు పైగా జలాలు శ్రీశైలం వైపు పరుగులు తీస్తున్నాయి. జూరాల పూర్తి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ఇప్పటికే 8.22 టీఎంసీల మేర నీరు చేరి నిండుకుండలా దర్శనమిస్తోంది. జూరాల నుంచి విడుదలవుతున్న మహా ప్రవాహంతో శ్రీశైలం జలాశయానికి సరికొత్త జలకళ వచ్చింది. శ్రీశైలంలో ఏకంగా 2.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో మొత్తం నిల్వ 155.26 టీఎంసీలకు చేరుకుంది. 215.8 టీఎంసీల పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుత నీటిమట్టం 873.199 అడుగుల వద్ద అలరారుతోంది. మరో రెండు మూడు రోజుల పాటు ఈ వరద ఉద్ధృతి ఇలాగే ఘనంగా కొనసాగుతుందని అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సాగర్ నిరీక్షణ.. జలాశయంలో ఆశల చిగురు**

శ్రీశైలం ఎగువన మహా ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ జలాశయానికి కూడా త్వరలోనే భారీ వరద రానుందనే ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం సాగర్‌లో 137.864 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, నీటిమట్టం 513.599 అడుగుల వద్ద నిలకడగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల పెరిగిన మరుక్షణమే నాగార్జునసాగర్‌లో కూడా జలకళ ఉట్టిపడనుందని, ఆ మహాద్భుత ఘట్టం కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరి బేసిన్‌లోనూ ఉరకలెత్తుతున్న జలసిరి**

కృష్ణా నదితో పాటు గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు సైతం ఈ పండుగ వాతావరణాన్ని పంచుకుంటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంతానికి వరద నీరు పోటెత్తింది. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 11,567 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 17.36 టీఎంసీల నీటి నిల్వతో ప్రాజెక్టు కళకళలాడుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి 13,118 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 12,980 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. ప్రస్తుతం 39.188 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యం ఉన్న ఈ జలాశయానికి రానున్న రోజుల్లో మరింత భారీగా నీరు చేరే అవకాశం పుష్కలంగా ఉంది. నామమాత్రంగా 975 క్యూసెక్కుల నీటిని మాత్రమే ఇక్కడి నుంచి విడుదల చేస్తున్నారు.

**నిండుకుండలా కడెం.. నిజాంసాగర్‌కు కొత్త కళ**

ఇటీవలి వరదలతో కడెం ప్రాజెక్టు మురిసిపోతోంది. 700 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి గాను ప్రస్తుతం 699.7 అడుగుల వద్ద జలకళను ప్రదర్శిస్తూ కనువిందు చేస్తోంది. ప్రాజెక్టులో 3.42 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2,292 క్యూసెక్కులు వస్తుండగా, ఔట్‌ఫ్లో 2,431 క్యూసెక్కులుగా నమోదైంది. అటు నిజాంసాగర్ జలాశయానికి కూడా వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. 17.8 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 10.228 టీఎంసీల మేర జలాలు చేరాయి. గోదావరి బేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో ఈ నిల్వలు మరింత పుంజుకునే అవకాశం ఉంది.

**జూరాల ప్రాజెక్టు:**
ఇన్‌ఫ్లో: 2,23,000 క్యూసెక్కులు
ప్రస్తుత నిల్వ: 8.22 టీఎంసీలు.

**శ్రీశైలం ప్రాజెక్టు:**
ఇన్‌ఫ్లో: 2,02,000 క్యూసెక్కులు
ప్రస్తుత నిల్వ: 155.26 టీఎంసీలు (873.199 అడుగులు)

**నాగార్జునసాగర్:**
ప్రస్తుత నిల్వ: 137.864 టీఎంసీలు (513.599 అడుగులు)


**శ్రీరాంసాగర్:**
ఇన్‌ఫ్లో: 12,980 క్యూసెక్కులు
ప్రస్తుత నిల్వ: 39.188 టీఎంసీలు

**శ్రీపాద ఎల్లంపల్లి:**
ఇన్‌ఫ్లో: 11,567 క్యూసెక్కులు
ప్రస్తుత నిల్వ: 17.36 టీఎంసీలు.

**కడెం ప్రాజెక్టు:**
ప్రస్తుత నీటిమట్టం: 699.7 అడుగులు (పూర్తి స్థాయి 700 అడుగులు)

**పొదుపు మంత్రంతో ప్రణాళికాబద్ధమైన అడుగులు**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా.. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న ఈ మహోగ్ర వరదలు రైతులకు, ప్రజలకు కొండంత అండగా నిలుస్తున్నాయి. ప్రాజెక్టులు జలకళ సంతరించుకోవడం అత్యంత శుభపరిణామం. అయినప్పటికీ, భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ అమూల్యమైన జలసంపదను అత్యంత పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకునే దిశగా నీటిపారుదల శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. నిరంతరం నిఘా ఉంచుతూ నీటి నిర్వహణను అద్భుతంగా పర్యవేక్షిస్తున్నారు.



# నిందితురాలికి ఐదేళ్ల జైలు శిక్ష

**వలిగొండ ఆగస్టు 7 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన బూరుగు పద్మ భర్త శ్రీనివాస్‌కు రామన్నపేట అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి. సబిత శుక్రవారం రోజు కేసు విషయంలో నిందితురాలు బూరుగు పద్మకు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినారు. గతంలో జరిగిన ఓ కేసు విషయంలో బూరుగు పద్మ భర్త శ్రీనివాస్ గ్రామం వలిగొండ వలిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినది. నిందితురాలికి ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు తీర్పు ఇవ్వడం జరిగిందనివలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ యుగేందర్ గౌడ్ తెలిపారు.

# అవినీతిపరులను వదిలిపెట్టను

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వార్నింగ్**

మునుగోడు, మహా : అవినీతి అధికారులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..చండూరూ మండలంలో ఎవరెవరు ఎంత పనిచేస్తున్నారో, ఎన్ని డబ్బులు తీసుకుంటున్నారో అన్ని వివరాల లిస్ట్ తీసుకువస్తానని అన్నారు. అందరినీ చూస్తానని, ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులు, లంచాలు తీసుకుంటున్న వారి పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. తనకు పదిసార్లు ఎమ్మెల్యే అవ్వాలని లేదని, రెండు సార్లు అవకాశం వచ్చినా అది చాలని అన్నారు. ఒకప్పుడు ఎనిమిదిసార్లు ఎమ్మెల్యే, పదిసార్లు ఎమ్మెల్యే అనేవారని కానీ తనకు అంత ఓపిక లేదని చెప్పారు. ఉన్నన్ని రోజులు నిజాయితీగానే పనిచేస్తానని తెలిపారు. అధికారులతో కూడా నిజాయితీగానే పనిచేయిస్తానని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలతో రెవెన్యూ సహా పలు శాఖల అధికారుల్లో చర్చ, ఆందోళన మొదలైంది

# సమాచార భవన్ కార్యాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**పాల్గొన్న ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి**

**హైదరాబాద్, మహా :** సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఉత్సవ ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో సమాచార శాఖ సంచాలకులు ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు డి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, సి.ఐ.ఈ. రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు సి. రాజారెడ్డి, ఆర్.ఐ.ఈ. జయ రామ్మూర్తి, సహాయ సంచాలకులు సత్యనారాయణ రెడ్డి, బిమల్ దేవ్, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నర్సింహా గౌడ్, అకౌంట్స్ ఆఫీసర్లు పద్మ, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీఓ అధ్యక్షుడు యేలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవోస్ నాయకులు అనిల్, జితేందర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడలో 60 కిలోల కుళ్లిన మాంసం స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 7 (మహా):** కాచిగూడ కమేళాలో హెచ్‌ఫాస్ట్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 60 కిలోల కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సమాచారంతో చేపట్టిన తనిఖీల్లో ప్రజల ఆరోగ్యానికి హానికరమైన మాంసాన్ని గుర్తించి ఫినాయిల్ చల్లి నిర్వీర్యం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మాంసాన్ని నిల్వ ఉంచిన యజమాని అఖిల్‌పై కేసు నమోదు చేసి చలాన్ విధించారు. ఆహార భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన ఆదేశాలు

- **ఫీజు వివరాలు తప్పనిసరిగా బహిరంగపరచాలని ఉత్తర్వులు**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దుకు హెచ్చరిక**

**హైదరాబాద్, మహా** తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయడంతో పాటు పారదర్శకతను పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేట్ పాఠశాలలు తరగతుల వారీగా వసూలు చేసే ఫీజు వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. తల్లిదండ్రులకు పూర్తి సమాచారం అందేలా ప్రతి పాఠశాల తమ ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రకటించాలని ఆదేశించింది. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ప్రాంగణంలోని నోటీస్ బోర్డుపై ఫీజు వివరాలను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. అలాగే పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అదే సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. దీంతో పాటు విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.inలో కూడా ఫీజు వివరాలను అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేసింది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో వివరించే పత్రాలు, గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా విద్యాశాఖ పోర్టల్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది. ఫీజుల నిర్ణయ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలన్న ఉద్దేశంతో ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. జీఓ ఎంఎస్ నెం.1-1994లోని 16, 18 నిబంధనల ప్రకారం ఫీజు వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు (డీఈవోలు) వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. నిబంధనలను ఉల్లంఘించే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. జీఓ ఎంఎస్ నెం.1లోని రూల్-11 ప్రకారం నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు లేదా అనుమతులను రద్దు చేసే వరకు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు (ఆర్‌జేడీలు) నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం పడకుండా చూడడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

## మక్కా రక్షణ ఒప్పందంతో కొత్త వ్యూహాత్మక కూటమి

- **పాక్, సౌదీ, టర్కీ మధ్య త్రైపాక్షిక రక్షణ ఒప్పందం.**
- **ఒక దేశంపై దాడి అంటే మూడింటిపై దాడిగానే పరిగణింపు.**

**మక్కా, మహా :** పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు చారిత్రక త్రైపాక్షిక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరుతో కుదిరిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై సాయుధ దాడి జరిగినా, అది మూడు దేశాలపై జరిగిన దాడిగానే పరిగణించి ఉమ్మడిగా స్పందించనున్నట్లు ప్రకటించారు. ఈ ఒప్పందంతో మూడు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలోపేతం కానుంది. ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించడం, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, సైనిక సాంకేతిక పరిజ్ఞానం, నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం, రక్షణ పరిశ్రమల్లో సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఈ ఒప్పందం కుదిరినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ రక్షణ కూటమి ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకుని రూపొందించలేదని, ప్రాంతీయ భద్రత, ఉమ్మడి రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశమని మూడు దేశాల నాయకత్వం స్పష్టం చేసింది.మూడు దేశాల్లో పాకిస్థాన్‌కు మాత్రమే అణ్వాయుధ సామర్థ్యం ఉండగా, టర్కీ నాటోలో రెండో అతిపెద్ద సైన్యాన్ని కలిగి ఉంది. సౌదీ అరేబియా ఆర్థిక, వ్యూహాత్మక సామర్థ్యంతో ఈ కూటమికి మరింత బలం చేకూరనుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందం భవిష్యత్తులో ఇతర మిత్రదేశాలకు కూడా విస్తరించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

## ప్రపంచ వడ్డీ రేట్లలో టర్కీ అగ్రస్థానం

- **5.25 శాతంతో మధ్యస్థానంలో భారత్.**
- **సున్నా శాతం వడ్డీతో స్విట్జర్లాండ్ చివర్లో.**

**ఢిల్లీ, మహా.** ప్రపంచ దేశాల కేంద్ర బ్యాంకులు అమలు చేస్తున్న కీలక వడ్డీ రేట్ల (పాలసీ ఇంట్రెస్ట్ రేట్స్) తాజా జాబితాలో టర్కీ అగ్రస్థానంలో నిలిచింది. అత్యధిక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే ప్రయత్నాల్లో భాగంగా టర్కీ కేంద్ర బ్యాంకు 37 శాతం వడ్డీ రేటును కొనసాగిస్తోంది. అనంతరం అర్జెంటీనా 29 శాతం, నైజీరియా 26.5 శాతంతో వరుస స్థానాల్లో ఉన్నాయి. బ్రెజిల్, రష్యా దేశాలు 14 శాతం వడ్డీ రేటుతో కొనసాగుతుండగా, కొలంబియా 12 శాతం, ఐస్‌లాండ్ 7.75 శాతం, దక్షిణాఫ్రికా 7 శాతం, మెక్సికో 6.5 శాతం వడ్డీ రేట్లను అమలు చేస్తున్నాయి. హంగరీ, ఇండోనేషియా చెరో 5.75 శాతం వడ్డీ రేటుతో కొనసాగుతున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు ప్రస్తుతం 5.25 శాతంగా ఉండటంతో ప్రపంచ దేశాల జాబితాలో భారత్ మధ్యస్థానంలో నిలిచింది. చిలీ 4.5 శాతం, ఆస్ట్రేలియా 4.35 శాతం, నార్వే, సౌదీ అరేబియా చెరో 4.25 శాతం వడ్డీ రేట్లను కొనసాగిస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, పోలాండ్, చెక్ రిపబ్లిక్ దేశాల్లో కీలక వడ్డీ రేటు 3.75 శాతంగా ఉంది. యూఏఈ 3.65 శాతం, ఇజ్రాయెల్ 3.5 శాతం, కోస్టారికా, చైనా చెరో 3 శాతం, దక్షిణ కొరియా 2.75 శాతం, న్యూజిలాండ్ 2.5 శాతం, కెనడా 2.25 శాతం వడ్డీ రేట్లను అమలు చేస్తున్నాయి. అత్యల్ప వడ్డీ రేట్ల జాబితాలో జపాన్ ఒక శాతంతో కొనసాగుతుండగా, స్విట్జర్లాండ్ సున్నా శాతం వడ్డీ రేటుతో చివరి స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, ఉపాధి పరిస్థితులు, కరెన్సీ స్థిరీకరణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు తమ ద్రవ్య విధానాలను రూపొందిస్తున్నాయి.

## జంతర్‌మంతర్ నిరసనలపై హైకోర్టు కీలక ప్రశ్నలు

- **నగరాన్ని బందీ చేయొద్దన్న జస్టిస్ అమిత్ మహాజన్.**
- **నిరసన అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశం.**




**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ప్రధాన వేదికగా కొనసాగుతున్న జంతర్‌మంతర్ ప్రాంతాన్ని పూర్తిగా మూసివేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ఢిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. నగరం నడిబొడ్డున జరిగే ఆందోళనల వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మొత్తం నగరాన్ని బందీ చేసే పరిస్థితి తలెత్తకూడదని జస్టిస్ అమిత్ మహాజన్ వ్యాఖ్యానించారు. జంతర్‌మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించాలా వద్దా అనేది ప్రభుత్వ నిర్ణయమే అయినప్పటికీ, తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం అక్కడ ఇలాంటి కార్యక్రమాలు జరగకూడదని స్పష్టం చేశారు.ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. జూలై నెలలోనే జంతర్‌మంతర్ వద్ద శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు అనుమతి ఇవ్వలేదని, తిరస్కరించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది సంజయ్ ఘోష్ కోర్టుకు తెలిపారు. నిరసనలో గరిష్ఠంగా 75 మంది మాత్రమే పాల్గొంటారని పేర్కొన్నప్పటికీ, దరఖాస్తుపై పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని వాదించారు.ఈ సందర్భంగా జస్టిస్ అమిత్ మహాజన్ స్పందిస్తూ, జంతర్‌మంతర్‌ను ఎందుకు మూసివేయకూడదని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను తాను వ్యతిరేకించడం లేదని, అయితే నగర ప్రజల సాధారణ జీవనానికి తీవ్ర అంతరాయం కలిగించే పరిస్థితులు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాలు, ప్రజాస్వామ్య హక్కుల మధ్య సమతుల్యత అవసరమని వ్యాఖ్యానించారు.కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ మాట్లాడుతూ, జంతర్‌మంతర్‌ను నిరసనల కోసం ప్రత్యేక ప్రదేశంగా కొనసాగించాలా లేదా అనే అంశాన్ని ఇప్పటికే సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జస్టిస్ మహాజన్ మరోసారి స్పందిస్తూ, వ్యక్తిగతంగా అక్కడ నిరసనలు జరగకూడదని తాను భావిస్తున్నానని పేర్కొన్నారు. అయితే ఢిల్లీలో శాంతియుత ప్రజాస్వామ్య నిరసనలకు అవకాశం ఉండదా అని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశ్నించగా, అది పోలీసులు పరిస్థితులను బట్టి నిర్ణయించాల్సిన అంశమని కోర్టు తెలిపింది. షాహీన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తించిన విషయాన్ని న్యాయవాది గుర్తుచేయగా, ప్రజాస్వామ్య హక్కులు ఉండాలని, అయితే వాటి కారణంగా నగరం మొత్తం బందీ కావడం సమంజసం కాదని జస్టిస్ మహాజన్ వ్యాఖ్యానించారు.విచారణ ముగింపులో ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సమర్పించిన నిరసన అనుమతి దరఖాస్తుపై ఆగస్టు 8లోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై భారత్ ఘాటు స్పందన

- **అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదని స్పష్టం**
- **విదేశీ నిధుల నియంత్రణకే సవరణలని వివరణ**




**ఢిల్లీ, మహా:** విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లుపై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రిలీ మూర్ చేసిన వ్యాఖ్యలకు భారత్ ఘాటుగా స్పందించింది. చట్టాల రూపకల్పన పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, ఇతర దేశాలు ఇందులో జోక్యం చేసుకోవడం సమంజసం కాదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు అమెరికాతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో కూడా ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని పేర్కొంది. అమెరికాలోని వెస్ట్ వర్జీనియా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు రిలీ మూర్ ఇటీవల ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును విమర్శించారు. ఈ బిల్లు క్రైస్తవ సంస్థలపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశముందని, చర్చిలు, మతపరమైన సేవా సంస్థల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిణామం భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్, విదేశీ నిధుల నియంత్రణ ప్రతి సార్వభౌమ దేశ హక్కులో భాగమని స్పష్టం చేశారు. విదేశీ నిధుల ప్రవాహాన్ని నియంత్రించే చట్టాలు అమెరికాతో పాటు అనేక దేశాల్లో అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. భారత పార్లమెంట్ రూపొందించే చట్టాలు పూర్తిగా దేశ అవసరాలు, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే నిర్ణయాలేనని తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకురానున్న ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుతో విదేశాల నుంచి స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలకు వచ్చే నిధులపై మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ నిధులు ఎందుకు వచ్చాయి, వాటిని ఏ కార్యక్రమాల కోసం వినియోగించారు, నిధుల ఖర్చు వివరాలు ఏమిటనే అంశాలపై సంస్థలు పూర్తి సమాచారం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. నిబంధనల ఉల్లంఘన లేదా ఆర్థిక అవకతవకలు జరిగినట్లు తేలితే సంబంధిత సంస్థల ఎఫ్‌సీఆర్ఏ నమోదును రద్దు చేయడంతో పాటు, విదేశీ నిధులను స్వాధీనం చేసుకునే అధికారాన్ని కూడా ప్రభుత్వానికి ఈ బిల్లు కల్పిస్తుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా విదేశీ నిధులను మతమార్పిడి, ఉగ్రవాద కార్యకలాపాలు, దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలు లేదా ప్రజా భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు వినియోగించకుండా నిరోధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## తెలంగాణ గడ్డపై ఒంటరి పోరు

- **సింగిల్‌గానే బీజేపీ ఎన్నికల బరిలో!**
- **జనసేనతో సహా ఎవరితోనూ పొత్తు లేదు.**
- **జీహెచ్ఎంసీ నుంచి అసెంబ్లీ దాకా ఒంటరిగానే.**
- **బీజేపీ జాతీయ నాయకత్వం కీలక దిశానిర్దేశం.**



**హైదరాబాద్, మహా.** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సరికొత్త సంచలన వ్యూహాన్ని ఆవిష్కరించింది. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండా, ఏకపక్షంగా, ఒంటరిగానే బరిలోకి దిగాలని ఆ పార్టీ అధిష్ఠానం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనతో కూడా రాష్ట్రంలో ఎలాంటి పొత్తు ఉండబోదని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టంగా తేల్చిచెప్పారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలతో సహా భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికల సమరంలోనూ బీజేపీ తన సొంత బలంతోనే బరిలో ఒక దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.

**ఢిల్లీలో వ్యూహరచన..అధిష్ఠానం దిశానిర్దేశం**

తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ జాతీయ నాయకత్వం, ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి భేటీలో రాష్ట్రానికి చెందిన అగ్రశ్రేణి నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, రాష్ట్ర ఇంచార్జ్ అభయ్ పాటిల్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్ తదితరులు సుదీర్ఘంగా రాజకీయ వ్యూహాలపై సమీక్షించారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై, అలాగే బూత్ స్థాయి మేనేజ్‌మెంట్ ద్వారా ప్రతి ఓటరును చేరుకోవడంపై అధిష్ఠానం వారికి ఖచ్చితమైన దిశానిర్దేశం చేసింది.

**పొత్తులకు గుడ్‌బై.. ఒంటరి పోరుకే సై**

గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి బీజేపీ పొత్తుల విషయంలో కఠిన నిర్ణయం తీసుకుంది. మిత్రపక్షాలతో సీట్ల పంపకాల వల్ల స్థానిక నాయకత్వం నైతిక స్థైర్యం దెబ్బతింటుందనే సుదీర్ఘ విశ్లేషణ తర్వాతే జనసేనతో సహా మరెవరితోనూ పొత్తు వద్దని అధిష్ఠానం తీర్మానించింది. కేడర్‌లో ఎలాంటి గందరగోళం లేకుండా, ప్రతి నియోజకవర్గంలో స్వంత బలంపైనే దృష్టి సారించి రాబోయే ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించే దిశగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను పూర్తిగా తమకు అనుకూలంగా మలుచుకోవాలని, ప్రతి వీధి, ప్రతి గ్రామంలో నాయకులు పర్యటించి ప్రజా సమస్యలపై గళమెత్తాలని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకులకు పిలుపునిచ్చారు.

**తెలంగాణ ఆకాంక్షల సాధన.. బీజేపీకే సాధ్యం**

ఢిల్లీ వేదికగా జరిగిన పలు సమావేశాల్లో రాష్ట్రంపై బీజేపీ తన ప్రత్యేక దృష్టిని చాటుకుంది. దశాబ్దం గడిచినా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, ఆ కలలను సాకారం చేసే బాధ్యతను బీజేపీ తన భుజాలపై వేసుకుంటుందని నితిన్ నబీన్ ఇటీవల జరిగిన పార్టీ కార్యక్రమాల్లో సైతం స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి ఎజెండాను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించిన ఆయన, తెలంగాణ ప్రజలు కోరుకున్న సుపరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పోరాడేది కేవలం బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తుచేశారు.

**విజయంపై అచంచల విశ్వాసం.. ఎన్. రామచందర్ రావు ధీమా**

పార్టీ సంస్థాగత బలంపై అధిష్ఠానం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాల పట్ల తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అమితమైన హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలం అపారంగా పెరిగిందని, ప్రజల పక్షాన నిలబడి అలుపెరగని పోరాటం చేయడం ద్వారా విజయం తథ్యమన్న నమ్మకంతో పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయని ఆయన ప్రకటించారు.

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై కాంగ్రెస్ విప్ జారీ

- **ఆగస్టు 10 నుంచి మూడు రోజుల హాజరు తప్పనిసరి.**
- **ఉభయ సభల సభ్యులకు అధిష్ఠానం కీలక ఆదేశాలు.**

**ఢిల్లీ, మహా :** వివాదాస్పద విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ ఉభయ సభల సభ్యులకు విప్ జారీ చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలకు కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. పార్టీ వైఖరికి అనుగుణంగా సభలో వ్యవహరించాలని స్పష్టం చేసింది.రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ ఈ మేరకు అధికారిక విప్ జారీ చేశారు. ఆగస్టు 10 నుంచి 12 వరకు రాజ్యసభలో అత్యంత కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నందున సభ్యులందరూ ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా హాజరై పార్టీ నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని సూచించారు. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించాలని సభ్యులను కోరారు.లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే తరహా విప్ జారీ అయింది. మూడు రోజుల పాటు ఎవరూ గైర్హాజరు కాకుండా సభకు హాజరై పార్టీ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని పార్టీ స్పష్టం చేసింది. అలాగే ఇండియా కూటమిలోని మిత్రపక్షాలకు కూడా సమాచారం ఇచ్చి, వారి సభ్యులందరూ సభకు హాజరుకావాలని కాంగ్రెస్ కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఇదిలా ఉండగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ముందస్తుగా సభ్యులకు విప్ జారీ చేసినట్లు తెలుస్తోంది.అయితే వచ్చే వారం పార్లమెంట్‌లో చేపట్టనున్న తాత్కాలిక ప్రభుత్వ కార్యక్రమాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ విడుదల చేసినప్పటికీ, అందులో ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు లేదా డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించిన ఎలాంటి ప్రస్తావన లేదు. అయినప్పటికీ ఈ బిల్లులు ఎప్పుడైనా సభ ముందుకు వచ్చే అవకాశం ఉందనే అంచనాతో కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

## ఈఎంఐలు బకాయిలైతే ఫోన్‌కు డిజిటల్ తాళం.

- **2027 నుంచి ఆర్‌బీఐ కొత్త నిబంధనలు అమలు.**
- **రుణ చెల్లింపుల్లో నిర్లక్ష్యానికి కఠిన చర్యలు.**

ఢిల్లీ, మహా : స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఈఎంఐలపై కొనుగోలు చేసే వినియోగదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక హెచ్చరిక జారీ చేసింది. రుణ వాయిదాలను నిర్లక్ష్యంగా చెల్లించకుండా బకాయిలు పెంచుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ నిబంధనల ప్రకారం, ఈఎంఐలను వరుసగా చెల్లించకపోతే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు రిమోట్ డివైస్ లాకింగ్ సదుపాయాన్ని వినియోగించి పరికరాలను పరిమితంగా లేదా పూర్తిగా లాక్ చేసే అవకాశం ఉంటుంది.

కొత్త విధానం ప్రకారం, ఈఎంఐ చెల్లింపులో 30 రోజులకుపైగా జాప్యం జరిగితే ముందుగా పాక్షిక లాక్ అమలు చేయనున్నారు. ఈ దశలో మొబైల్‌లోని కొన్ని యాప్‌లు, సేవలు, ఫీచర్లు పనిచేయకుండా నిలిపివేస్తారు. అనంతరం 60 రోజులకుపైగా బకాయిలు కొనసాగితే సంబంధిత పరికరాన్ని పూర్తిస్థాయిలో లాక్ చేసే అవకాశం ఉంటుంది. ఈ నిబంధనలు కేవలం స్మార్ట్‌ఫోన్లకే కాకుండా రుణంపై కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లకు కూడా వర్తించనున్నాయి.

అయితే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు కొన్ని మినహాయింపులు కల్పించారు. పరికరం పూర్తిగా లాక్ అయినప్పటికీ అత్యవసర కాల్స్, ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు వంటి ప్రాథమిక కమ్యూనికేషన్ సేవలు కొనసాగుతాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంది. వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం కలగదని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది. రిమోట్ డివైస్ లాకింగ్ ప్రక్రియలో బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థలకు వినియోగదారుల ఫోన్‌లోని ఫోటోలు, వీడియోలు, కాంటాక్ట్‌లు, బ్యాంకింగ్ యాప్‌లు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని చూడటానికి, కాపీ చేసుకోవడానికి లేదా వినియోగించడానికి ఎలాంటి అనుమతి ఉండదని తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తిగా పరికరం వినియోగాన్ని పరిమితం చేయడానికే పరిమితమవుతుందని వివరించింది.

## విడాకుల పిటిషన్ వెనక్కి తీసుకున్న సంగీత.

- **కుటుంబ కోర్టులో సీఎం విజయ్‌కు భారీ ఊరట.**
- **కేసును మూసివేసిన చెంగల్పట్టు న్యాయస్థానం.**

**చెంగల్పట్టు, మహా :** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు కుటుంబ న్యాయస్థానంలో ఊరట లభించింది. ఆయన సతీమణి సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో చెంగల్పట్టులోని కుటుంబ సంక్షేమ న్యాయస్థానం కేసును అధికారికంగా మూసివేసింది. ఈ పరిణామంతో గత కొంతకాలంగా రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ వివాదానికి ప్రస్తుతానికి తెరపడింది.2025 డిసెంబర్ 5న సంగీత చెంగల్పట్టు కుటుంబ సంక్షేమ కోర్టులో విజయ్ నుంచి విడాకులు కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన విచారణలో ఆమె వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను స్వచ్ఛందంగా ఉపసంహరించుకుంటున్నట్లు న్యాయస్థానానికి తెలియజేశారు.సంగీత నిర్ణయంపై విజయ్ తరఫు న్యాయవాదులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఇరు పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసును పూర్తిగా మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విజయ్‌కు న్యాయపరంగా పెద్ద ఊరట లభించినట్లైంది.విజయ్, సంగీతల వైవాహిక జీవితానికి సంబంధించిన ఈ వివాదం గత కొంతకాలంగా తమిళనాడు రాజకీయాలతో పాటు సినీ పరిశ్రమలోనూ విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా విజయ్ రాజకీయాల్లో పూర్తి స్థాయిలో చురుకుగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఆకస్మికంగా ఎందుకు ఉపసంహరించుకున్నారనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇరు కుటుంబాల మధ్య రాజీ కుదిరిందా, లేక వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నారా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ పరిణామం ముఖ్యమంత్రి విజయ్‌కు అనుకూలంగా మారిందని రాజకీయ, సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## ధాన్యం అక్రమాలపై సీఎంకు బీజేపీ లేఖ

**ధాన్యం మళ్లింపుపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్.**


*** దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాం**

చందర్‌రావు విజ్ఞప్తి. హైదరాబాద్, మహా. తెలంగాణలో ప్రభుత్వ కొనుగోలు చేసిన ధాన్యం మళ్లింపుపై వచ్చిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న అక్రమాలపై నిష్పక్షపాతంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు రూ.500 కోట్ల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం అక్రమాలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు అప్పగించిన ధాన్యంలో వేల టన్నుల నిల్వలు కనిపించకపోవడం, ప్రభుత్వానికి బియ్యం రూపంలో తిరిగి అందకపోవడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి మిల్లులకు అందజేసిన ధాన్యం, ప్రభుత్వానికి తిరిగి వచ్చిన బియ్యం పరిమాణాల మధ్య వ్యత్యాసం పెరుగుతోందనే నివేదికలు రైతుల్లోనూ, ప్రజల్లోనూ అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారానికి కీలకమైనదని, ప్రజా పంపిణీ వ్యవస్థకు ఇది అత్యంత ముఖ్యమైన భాగమని రాంచందర్‌రావు అన్నారు. ప్రభుత్వ ధాన్యం మళ్లింపు లేదా దుర్వినియోగం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లడమే కాకుండా, రైతులు ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై ఉంచిన విశ్వాసం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కొనసాగుతున్న దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, వేగంగా జరగాలని డిమాండ్ చేశారు. బాధ్యులు ఎవరైనా, ఎంతటి హోదాలో ఉన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియల్లో పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాధనం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, బాధ్యతాయుత చర్యల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని రాంచందర్‌రావు తన లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.



# నేతన్న సేవలో బాబు

**అమరావతి, మహా :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా "నేతన్నల సేవలో" పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. 71,536 చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించాం. వస్త్ర తయారీ, వస్త్ర వ్యాపారంలో ప్రసిద్ధి చెందిన చీరాల ప్రాంతంలో నేతన్నల సమక్షంలో రూ.179 కోట్లను విడుదల చేశారు. నేతన్నలతో ఆత్మీయ సమావేశాన్ని మరిచిపోలేనని, తన చిత్రాన్ని మగ్గంపై నేసిన చేనేత దంపతులు నాగేశ్వరరావు, లక్ష్మిలతో మాట్లాడారు. ఎంతో నైపుణ్యంతో చిత్రపటాన్ని వస్త్రంపై నేసిన చేనేత దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.









# వ్యాయామం, డైట్ మాత్రమే కాదు... టైప్-2 డయాబెటిస్ ప్రమాదంలో జన్యువులూ కీలకం



**ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్లో టైప్-2 డయాబెటిస్ ఒకటి. భారత్‌లో కూడా ఈ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతోంది. సాధారణంగా అధిక బరువు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్లే డయాబెటిస్ వస్తుందని చాలా మంది భావిస్తుంటారు. అందుకే వైద్యులు సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం వంటి సూచనలు ఇస్తుంటారు. అయితే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తున్న ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన ప్రయోజనం కలగదని తాజా శాస్త్రీయ అధ్యయనం వెల్లడించింది. జీవనశైలి మార్పులు పాటించినప్పటికీ కొందరిలో టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం అలాగే కొనసాగుతుందని పరిశోధకులు గుర్తించారు.**

## టైప్ 2 డయాబెటిస్ ఎలా వస్తుంది?

టైప్ 2 డయాబెటిస్ అనేది శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడం లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను సమర్థంగా వినియోగించుకోలేకపోవడం వల్ల వచ్చే దీర్ఘకాలిక జీవక్రియ వ్యాధి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువ కాలం నియంత్రణలో లేకపోతే గుండె, మూత్రపిండాలు, కళ్ల దృష్టి, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి నియంత్రించడం అత్యంత అవసరం.ఇప్పటి వరకు సరైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, బరువు తగ్గడం వంటి అంశాలే టైప్ 2 డయాబెటిస్ నివారణకు ప్రధాన మార్గాలుగా భావించారు. ఈ పద్ధతులు ఇప్పటికీ అత్యంత ప్రభావవంతమైనవే అయినప్పటికీ, అవి అందరికీ ఒకే స్థాయిలో రక్షణ కల్పించవని తాజా అధ్యయనం చెబుతోంది. కొందరు సంవత్సరాల పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించి గణనీయంగా బరువు తగ్గినా, వారిలో ఇన్సులిన్ నిరోధకత తగ్గకపోవడంతో డయాబెటిస్ ప్రమాదం అలాగే కొనసాగుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.





## కొత్త అధ్యయనం ఏమి చెబుతోంది?

పరిశోధనలో భాగంగా అనేక మంది ఆరోగ్య పరిస్థితులను దీర్ఘకాలం పరిశీలించిన శాస్త్రవేత్తలు, జీవనశైలి మార్పులకు ప్రతి వ్యక్తి శరీరం భిన్నంగా స్పందిస్తుందని వెల్లడించారు. కొందరిలో బరువు తగ్గిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా తగ్గి, ఇన్సులిన్ పనితీరు మెరుగుపడింది. మరికొందరిలో అదే స్థాయిలో బరువు తగ్గినా జీవక్రియల్లో ఆశించిన మార్పులు కనిపించలేదు. దీనివల్ల ఒకే విధమైన ఆరోగ్య సూచనలు అందరికీ సమాన ఫలితాలను ఇవ్వవని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

ఈ అధ్యయనం ప్రకారం టైప్ 2 డయాబెటిస్‌కు జీవనశైలి మాత్రమే కారణం కాదు. జన్యుపరమైన లక్షణాలు, శరీరంలో కొవ్వు పేరుకుపోయే తీరు, జీవక్రియల పనితీరు, హార్మోన్ల ప్రభావం వంటి అనేక అంశాలు కూడా వ్యాధి ప్రమాదాన్ని నిర్ణయిస్తాయి. ముఖ్యంగా పొట్ట చుట్టూ మరియు అంతర్గత అవయవాల చుట్టూ పేరుకునే కొవ్వు డయాబెటిస్ ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుందని పరిశోధకులు చెబుతున్నారు. చర్మం కింద ఉండే కొవ్వుతో పోలిస్తే అంతర్గత అవయవాల చుట్టూ ఉండే కొవ్వు జీవక్రియలను దెబ్బతీసే అవకాశం ఎక్కువగా ఉంటుందని వారు వివరించారు.

'డయాబెటిస్' శాస్త్రీయ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం కేవలం బరువు తగ్గడమే ఆరోగ్యకరమైన జీవక్రియలకు సూచిక కాదని తేలింది. అధ్యయన బృందంలోని ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ నార్బర్ట్ స్టెఫాన్ మాట్లాడుతూ, ప్రమాదకర వర్గంగా గుర్తించిన కొందరు వ్యక్తులు దాదాపు తొమ్మిదేళ్లపాటు సుమారు ఎనిమిది శాతం వరకు బరువు తగ్గి అదే స్థాయిలో కొనసాగించినప్పటికీ, వారిలో గ్లూకోజ్ స్థాయిలు పెరగడం, ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గడం వంటి మార్పులు కనిపించడం ఆశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు.




### ఇన్సులిన్ నిరోధకత అంటే ఏమిటి?

ఇన్సులిన్ అనేది క్లోమగ్రంథి ఉత్పత్తి చేసే ముఖ్యమైన హార్మోన్. ఇది రక్తంలోని గ్లూకోజ్‌ను శరీర కణాల్లోకి పంపి శక్తిగా మార్చేందుకు సహాయపడుతుంది. కానీ శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించని పరిస్థితిని ఇన్సులిన్ నిరోధకతగా పిలుస్తారు. ఈ పరిస్థితిలో రక్తంలోని చక్కెరను నియంత్రించేందుకు శరీరం మరింత ఇన్సులిన్ ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. కాలక్రమేణా క్లోమగ్రంథి సామర్థ్యం తగ్గి తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోతే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి టైప్ 2 డయాబెటిస్‌కు దారితీస్తుంది. ఈ మార్పులు బయటకు లక్షణాలు కనిపించే ముందు నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందని నిపుణులు ెబుతున్నారు.

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర నిర్మాణం, జన్యుపరమైన లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. అందువల్ల ఒకే విధమైన ఆహార నియమాలు లేదా వ్యాయామ ప్రణాళిక అందరికీ సమాన ఫలితాలు ఇవ్వవు. కొందరిలో జన్యువుల ప్రభావంతో చిన్న వయస్సులోనే ఇన్సులిన్ నిరోధకత ప్రారంభమవుతుంది. మరికొందరిలో వయస్సు పెరుగుతున్న కొద్దీ ఇన్సులిన్ ఉత్పత్తి సహజంగానే తగ్గుతుంది. హార్మోన్ల అసమతుల్యత, కాలేయ సమస్యలు, జీవక్రియలలో తేడాలు కూడా డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచే అంశాలుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### జీవనశైలి మార్పులు ఇంకా ఎందుకు అవసరం?

ఈ పరిశోధన వ్యాయామం, ఆహార నియంత్రణ అవసరం లేదని చెప్పడం లేదు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఇప్పటికీ డయాబెటిస్ నియంత్రణలో అత్యంత ప్రభావవంతమైన ఆయుధమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. చాలా మందిలో ఇన్సులిన్ పనితీరు మెరుగై రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి. ఇప్పటికే డయాబెటిస్ ఉన్నవారిలో కూడా ఈ అలవాట్లు వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు మూత్రపిండాలు, కంటి చూపు, నరాల సమస్యలు వంటి సంక్లిష్టతలను తగ్గించడంలో సహాయపడతాయి.

vకుటుంబంలో డయాబెటిస్ చరిత్ర ఉన్నవారు, అధిక బరువు లేదా పొట్ట చుట్టూ ఎక్కువ కొవ్వు ఉన్నవారు, ప్రీడయాబెటిస్ ఉన్నవారు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నవారు, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ ఉన్న మహిళలు, ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారు, 45 సంవత్సరాల పైబడిన వారు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వీరు క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సలహా మేరకు వ్యక్తిగత ఆరోగ్య ప్రణాళికను అనుసరించడం ద్వారా డయాబెటిస్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.భవిష్యత్తులో డయాబెటిస్ నివారణ, చికిత్సలో అందరికీ ఒకే విధమైన విధానాన్ని అనుసరించడం కంటే ప్రతి వ్యక్తి జన్యువులు, జీవక్రియల స్వభావం, శరీర నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుని వ్యక్తిగత వైద్య విధానాలు రూపొందించే దిశగా పరిశోధనలు సాగాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీంతో టైప్ 2 డయాబెటిస్‌ను మరింత సమర్థంగా నివారించడంతో పాటు చికిత్స ఫలితాలను కూడా మెరుగుపరచే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.



# శాకంబరి అలంకరణలో కనువిందు చేసిన కనకదుర్గమ్మ...



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అశోక్‌నగర్ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాకంబరి అలంకరణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శాకంబరి అవతారంలో కొలువుదీరిన అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పుష్పాలతో సుందరంగా అలంకరించడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దివ్య దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకంబరి దేవిని అన్నపూర్ణ స్వరూపిణిగా, సకల జీవరాశులకు ఆహారాన్ని ప్రసాదించే తల్లిగా భక్తులు విశ్వసిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కళ్యాణ్ స్వామి మాట్లాడుతూ, శాకంబరి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి భక్తునిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, యువకులు, స్థానిక ప్రజలు, వివిధ కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం..

**చేనేతకు చేయూతనివ్వాలన్న నేతలు..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కార్యదర్శి, మణుగూరు మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై చేనేత జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుస్సా సమ్మయ్య మాట్లాడుతూ.. 1905 ఆగస్టు 7న కలకత్తాలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ వేడుకలు నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో సంప్రదాయ కుల వృత్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి పౌరుడు వారంలో కనీసం ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించి, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, గౌరవ అధ్యక్షులు కొరివి బసవయ్య, తుమ్మ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు కుర్రి నరసింహారావు, వెన్నం వెంకట్రావు, సిరిపురం కోటేశ్వరరావు, గంగిశెట్టి శ్రీనివాసరావు, దాసరి విశ్వేశం, తాటి సత్యనారాయణ, దాసరి అనిల్ కుమార్, వెనగాల వెంకటేశ్వర్లు, ఆమంచి సత్యనారాయణ, భోగ గోపి, ఊసకోయల రాజశేఖర్, శ్రీరామ్ రమేష్, ఆడప శ్రీనివాస్, వెనగాల ఇస్తారి, కొరివి రంగయ్య, అడిచర్ల కొమరయ్యతో పాటు పెద్ద సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.




# ముగిసిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది శిక్షణ తరగతులు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెంలోని సింగరేణి ఎస్ అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్లో నాలుగు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ పాల్గొని ప్రసంగించారు. సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని పేర్కొన్నారు. ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని చెప్పారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మెయిన్ గేటు వద్ద చెక్ పోస్ట్‌ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఎస్ అండ్ పిసి విభాగాన్ని పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు స్థలాలను పరిరక్షించాలని సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపిక అయిన సందీప్ కుమార్, కె.సతీష్ లకు బహుమతి ప్రదానం గావించారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు నిత్యావసరాలు వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణరెడ్డి, జూనియర్ ఇన్స్పెక్టర్ కె.రాజనర్సు, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

- **రైతులు ఆధార్ లేదా ఫార్మర్ ఐడీతో నమోదు చేసుకోవాలి**
- **ఏడీఏ తాతారావు**



**మణుగూరు, మహా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా శుక్రవారం నుంచి రైతులకు ఎరువుల విక్రయాలు చేపట్టనున్నట్లు మణుగూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి తాతారావు తెలిపారు. పినపాక నియోజకవర్గ రైతులు ఈ యాప్‌ను వినియోగించుకుని డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ తదితర ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కరకగూడెం, పినపాక, మణుగూరు మండలాల్లో పర్యటించిన ఆయన నూతన యాప్ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ విధానాన్ని వివరించారు. రైతులు ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ ఐడీతో యాప్‌లో నమోదు చేసుకుని, పంట వివరాలు, సాగు విస్తీర్ణాన్ని నమోదు చేయాలని తెలిపారు. నమోదు పూర్తయిన తర్వాత క్యూ ఆర్ కోడ్ లేదా ప్రత్యేక ఐడీ జారీ అవుతుందని, దాని ఆధారంగా రెండు రోజులలోపు ఎరువులు పొందవచ్చని చెప్పారు. ఎరువులు బుక్ చేసుకున్న రైతులకు అవసరమైతే బుకింగ్‌ను రద్దు చేసుకునే సౌకర్యాన్ని కూడా యాప్‌లో కల్పించారని తెలిపారు. యాప్ వినియోగంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల యజమానులు, సహకార సంఘాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యాల అమలులో ప్రణాళికలు కీలకం

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అభివృద్ధి లక్ష్యాల అమలులో ప్రణాళికలు కీలకమని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో జిల్లా మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రతి మండలం రెండు లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసి ఆయా లక్ష్యాలకు సంబంధించిన కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలను మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లక్ష్యాలు గ్రామాల అవసరాలు స్థానిక పరిస్థితులు అందుబాటులో ఉన్న వనరులు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని సూచించారు.మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు భౌతిక ఆర్థిక ప్రగతి అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు.పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన జీవనోపాధి మెరుగుదల ఆరోగ్యవంతమైన గ్రామాలు బాలలకు అనుకూల వాతావరణం నాణ్యమైన విద్య తాగునీటి సౌకర్యం పారిశుద్ధ్యం పచ్చదనం స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు సామాజిక న్యాయం సుపరిపాలన మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి ఆదాయ వనరుల పెంపు కోసం గ్రామీణ పర్యాటకం ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు పౌల్ట్రీ పశుసంవర్ధక అభివృద్ధి సేంద్రీయ వ్యవసాయం గ్రామ ఉత్పత్తుల జియో ట్యాగింగ్ బ్రాండింగ్ మార్కెటింగ్ మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వృద్ధి కార్యక్రమాలు వంటి ప్రాజెక్టులను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు నిధులు వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం అంచనా వ్యయం నిధుల వనరు అమలు చేసే శాఖ కాలపట్టిక ఆశించిన ఫలితాలను స్పష్టంగా తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా గోరింటాకు పోటీలు

మణుగూరు, మహా: సింగరేణి మణుగూరు ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోరింటాకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతీ ముఖ్య అతిథిగా హాజరై మహిళల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, పాల్గొన్న సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అయోధ్య వర్ధంతి సభను విజయవంతం..

- **పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు..**
- **సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి..**



**మణుగూరు, మహా :** సీపీఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, దివంగత నేత బొల్లోజు అయోధ్య స్థూపావిష్కరణ, ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై సహకరించిన ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులకు, ప్రజాసంఘాల ప్రతినిధులకు, గ్రామాల ప్రజలకు, పట్టణ ప్రముఖులకు, విద్యావంతులకు, వ్యాపారవేత్తలకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, కుల సంఘాల నాయకులకు, మేధావులకు, మహిళలు, యువకులు, కార్మికులు, బీటీపీఎస్ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, అలాగే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు, శాంతి భద్రతల నిర్వహణలో సహకరించిన పోలీసు శాఖ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారం వల్లే కార్యక్రమం విజయవంతమైందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదే విధంగా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్‌రావు, వై. రాంగోపాల్, ఎడారి రమేష్, సొందే కుటుంబరావు, సర్పంచులు బాడిస కల్పన, చీదం ఉషారాణి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వేరుపుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఎస్.కే. సర్వర్, గిరిజన సమైక్య మండల అధ్యక్షుడు వజ్జ వెంకటేశ్వర్లు, కార్యదర్శి కన్నెబోయిన ప్రసాద్, మాజీ సర్పంచ్ బాడిస సతీష్, ఉపసర్పంచ్ పులిగిల్ల రమేష్, నోముల రవి, రాయల బిక్షం, కొత్తపల్లి సీతారాములు, బోలగాని సమ్మక్క, కోడిమేల సుజాత, బోసెట్టి సంపత్, ఎస్‌వీ నాయుడు, ఆధార్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్ర ప్రసాద్‌కు ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన జి. రాజేంద్ర ప్రసాద్‌ను జీఎం(పర్సనల్)లు ఘనంగా సన్మానించారు. శుక్రవారం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం జి.వి. కిరణ్ కుమార్, జీఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి మురళీధరరావు, జీఎం(పర్సనల్) వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే. అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్ర ప్రసాద్ కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



## దోమల మందు పిచికారీ..

**ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో ప్రజలకు అవగాహన..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో గల వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పలగుంపు, ఎస్టీ కాలనీలో శుక్రవారం దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా తొలి విడతగా శుక్రవారం దోమల మందు పిచికారీ చేపట్టారు. గ్రామంలోని అన్ని ఇళ్లలోని గదుల్లో దోమల మందు పిచికారీ నిర్వహించారు.అనంతరం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని నీటి నిల్వ పాత్రలను పరిశీలించి, లార్వా ఉన్న కంటైనర్లను తొలగించారు. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి వీరాస్వామి మాట్లాడుతూ, డెంగీ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, కౌసల్యతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆగస్టు 10న తహసిల్దార్ కార్యాలయ ముట్టడికి భారీగా తరలిరండి

**జైల్ భరో విజయవంతం చేయాలని జాజిరి శ్రీనివాస్ పిలుపు**

**సత్తుపల్లి, ఆగస్టు 7:మహా :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి మండల తహసిల్దార్ కార్యాలయం ముట్టడిలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. శుక్రవారం సత్తుపల్లిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల నాయకుడు వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సీ.ఐ.టీ.యూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా రోజువారీ పనిగంటలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచేలా చట్టాల్లో మార్పులు చేసిందని ఆరోపించారు. ఈ విధానాలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు అన్ని పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అమలు చేయాలని, విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే హామీ పథకాన్ని బలోపేతం చేసి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.800 కనీస వేతనం చెల్లించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జాజిరి జ్యోతి, సీ.ఐ.టీ.యూ మండల కన్వీనర్ కావూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కావ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, ఎలగం రాములు, కొప్పుల చిన్నస్వామి, దాట్ల రాంబాబు, తడికమళ్ల రామకృష్ణ, కొత్తపల్లి రఘు, తోటకూర వెంకట్రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# లంకమల్లారంలో బెల్ట్‌షాపులకు నో..!

**గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం..**
**నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా..**

**మణుగూరు, మహా** : గ్రామాల అభివృద్ధితో పాటు సామాజిక సంస్కరణలకు కూడా గ్రామపంచాయతీలు వేదిక కావచ్చని మణుగూరు మండలం లంకమల్లారం గ్రామపంచాయతీ నిరూపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఏ గ్రామపంచాయతీ తీసుకోని విధంగా బెల్ట్‌షాపుల ద్వారా మద్యపానాన్ని నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడం విశేషం. గ్రామంలో శాంతిభద్రతలు, కుటుంబ సంక్షేమం, మహిళల భద్రత, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, గ్రామ పెద్దలు అభినందిస్తున్నారు. లంకమల్లారం గ్రామపంచాయతీలో 202627 గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ, ఆమోదం సందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ ఏఈ, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలో భాగంగా విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు. గ్రామసభలో మొత్తం 35 దరఖాస్తులు స్వీకరించారు. రోడ్ల అభివృద్ధికి సంబంధించిన 15, ఐకేపీ-డ్వాక్రాకు ఒకటి, ప్రాథమిక పాఠశాలకు ఒకటి, ఇంకుడు గుంతల నిర్మాణానికి రెండు, పింఛన్లకు రెండు, ఇందిరమ్మ ఇళ్లకు 13, రిజర్వేషన్ కోటా నుంచి తొలగింపునకు ఒక దరఖాస్తు స్వీకరించి పరిశీలనకు నిర్ణయించారు. అనంతరం గ్రామంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు, మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ తీర్మానాన్ని ఉల్లంఘించే వారిపై రూ.1 లక్ష జరిమానా విధించాలని, బెల్ట్‌షాపుల వల్ల గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, వివాదాలు జరిగినా అందుకు సంబంధిత యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని గ్రామసభ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళల భద్రత, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గ్రామసభ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. గ్రామాభివృద్ధి, సామాజిక శాంతి కోసం ప్రజలంతా సహకరించాలని కోరారు. గ్రామసభలో హౌసింగ్ ఏఈ, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్దలసంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామీణ పేదలకు ఉపాధి దూరంచేస్తున్న కేంద్రం

- జైలు భరోతో పేదల సత్తా చూపాలి వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు

**కారేపల్లి, మహా:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. కార్మిక, కర్షక, రైతు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదిన నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువస్తోందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా కొత్త బిల్లులను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పిస్తున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదల సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కే.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేసగాని ఉపేందర్, ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

- వేడుకల్లో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 7 మహా:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక అని, మానవాళికి వస్త్రాలను అందిస్తూ సమాజానికి అపూర్వమైన సేవ చేస్తున్న నేతన్నల కృషి చిరస్మరణీయమని అన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు, కళా వైభవానికి విశిష్టమైన గుర్తింపును తీసుకొచ్చిన ప్రతి చేనేత కుటుంబానికి సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పిస్తూ వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. వస్త్రాల కొనుగోలు, పంపిణీలో పారదర్శకత పెంచేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా డూప్లికేట్ ఉత్పత్తులకు అడ్డుకట్ట పడటమే కాకుండా, అసలైన చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు చేనేత కళాకారుల ప్రతిభను చాటిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశంను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. చేనేత రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేతన్నల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం అవసరమైన అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వారి జీవనోపాధి మెరుగుపడేందుకు సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం అర్హులైన చేనేత కార్మికులకు రుణమాఫీ భరోసా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన నేతన్నలకు అవార్డులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, చేనేత & జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి శ్రీరేఖ-బాబురావు, యునైటెడ్ వే హైదరాబాద్ సీఈఓ రేఖా శ్రీనివాసన్, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు లవకుమార్, భువనగిరి చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఏలే సుధాకర్, జిల్లా అధికారులు, చేనేత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు, తదితరులు పాల్గొన్నారు..



# ఆరోగ్యశ్రీ ఆవిర్భావ వేడుకలు

**ఆలేరు, ఆగస్టు 7 (మహా):** ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆలేరు కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్-ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేసిన కృషి కీలకమని అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ పేద మహిళ సమస్యను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పేదలకు ఉచిత వైద్యం అందించే దిశగా ఉద్యమం ప్రారంభమైందన్నారు. 2004లో గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులతో చేపట్టిన ఉద్యమం ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది మంది పేదలకు నాణ్యమైన వైద్యం అందిందని, ఎంఆర్‌పీఎస్ ఉద్యమం కేవలం రిజర్వేషన్లకే కాకుండా పేదల సంక్షేమం, ఎస్సీ, ఎస్టీల హక్కులు, రేషన్, మహిళల రక్షణ వంటి అనేక అంశాలపై కూడా పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గం, మండల, పట్టణ ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# త్రివేణి పాఠశాలల్లో ఘనంగా బోనాల ఉత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన జరిగే బోనాలను ముందస్తుగా శుక్రవారం త్రివేణి పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివేణికృష్ణవేణి సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్ మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టత తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేస్తూ బోనాల పండుగ ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ జానపద కళలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని బోనాల పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని త్రివేణికృష్ణవేణి సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్, గొల్లపూడి వీరేంద్రచౌదరి, సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీ క్రిష్ణ, ప్రిన్సిపాల్స్ సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ సింగ్, నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య శుభాకాంక్షలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారికి ఆషాఢ మాస సారే సమర్పణ

- సింగరేణి పీవీఎన్ఆర్ కాలనీలో మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కార్యక్రమం



**సత్తుపల్లి, మహా :** పట్టణంలోని సింగరేణి జే.వీ.ఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ దుర్గాభవాని అమ్మవారికి సింగరేణి పీ.వీ.ఎన్.ఆర్ కాలనీ మహిళలు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం భక్తిశ్రద్ధలతో సారే సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు నిష్ఠా నియమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, పిండివంటలు, నూతన వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం సామూహికంగా నైవేద్యం సిద్ధం చేసి అమ్మవారికి నివేదించి, భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని ఇంటి ఆడబిడ్డగా భావించి ప్రేమాభిమానాలతో సారే సమర్పించడం తెలుగు సంప్రదాయంలో విశిష్ట ఆచారమని మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడగా, అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సింగరేణి కాలనీ మహిళలు, ఆడపడుచులు, సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# సీసీటీవీల పై అవగాహన కార్యక్రమం



**భువనగిరి ఆగస్టు 7 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, మరమ్మత్తులు పై పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు . "ప్రతి కెమెరా ఒక భద్రతా కవచం - సురక్షిత యాదాద్రి భువనగిరి కోసం అందరం కలిసి ముందుకు సాగుదాం." అనే నినాదంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, మరమ్మత్తులు మరియు సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు గ్రామాలు, కాలనీలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు మరియు ఇతర ముఖ్య ప్రాంతాలను సందర్శించి ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మత్తు చేయాలని సంబంధిత యజమానులకు సూచించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, దర్యాప్తులో కీలక ఆధారాల సేకరణ, అనుమానాస్పద కదలికల పర్యవేక్షణ మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని పోలీసులు వివరించారు. ప్రతి ఇల్లు, దుకాణం, వ్యాపార సంస్థ, అపార్ట్‌మెంట్ మరియు గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉంచాలని సూచించారు. అదేవిధంగా గ్రామ ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, విద్యాసంస్థల నిర్వాహకులు మరియు ప్రజలందరూ సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి, సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి యాదాద్రి భువనగిరి జిల్లాను మరింత సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.



# స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

- రెవెన్యూ కలెక్టర్ వెంకా రెడ్డి

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 7 మహా:** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హల్ లో అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పై ఆయా శాఖల వారీగా సమీక్షించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, వి ఐపిలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా శాఖల వారీగా, స్టాల్స్, శకటాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,భువనగిరి ఆర్డిఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 7 (మహా):** యాదగిరిగుట్ట పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నల్లచెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులను వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పాతగుట్ట రోడ్డులో సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దమోరి ప్రాంతంలో డ్రైనేజీ, రహదారుల సమస్యలపై అధికారులతో చర్చించారు. బీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ సహాయం ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీసీ కాలనీలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు కుర్చీలు, ప్లేట్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి వారి చదువు, వసతి, భోజన సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యాదగిరిపల్లి, అంగడి బజార్ ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాతగుట్టలో స్థానికులను కలిసి రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కల్లు కాంపౌండ్‌ను సందర్శించి గౌడ్ వృత్తిదారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాణి భారత్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# అంగన్ వాడిలో అన్నప్రాసన వేడుక

**తల్లిపాలు బిడ్డకు రక్షణకవచం**

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం చీమలపాడు సెక్టార్ పరిధిలోనే ఈట్యాతండా అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నప్రాసన వేడుకను జరిపారు. పిల్లలకు తల్లిపాలు, పౌష్టికాహారం గురించి తల్లులకు వివరించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమణ, సర్పంచ్ జయంతి లు మాట్లాడుతూ ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టినప్పుడు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వలన పిల్లలకు రోగ నిరోధశక్తి పెరిగి రోగాలు భారిన పడకుండా రక్షణ కవచం తయారవుతుందన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డ సంపూర్ణం ఆరోగ్యం వంతులాగు ఉంటారన్నారు.

# గాయత్రి స్కూల్లో ఘనంగా బోనాలు

**వలిగొండ ఆగస్టు 7 మహా న్యూస్ :** వలిగొండ పట్టణంలో గాయత్రి హైస్కూల్ నందు శుక్రవారం విద్యార్థులు బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి అనురాధ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకునే చారిత్రక, సాంస్కృతిక జానపద పండుగ. ఇది ప్రధానంగా ఆషాఢ మాసంలో మహాకాళి పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ మొదలైన గ్రామ దేవతలు అమ్మవార్లకు నిర్వహించే కృతజ్ఞతా పూజ. బోనం అంటే భోజనం అనే సంస్కృత వికృతి రూపమే బోనం. ఇది అమ్మవారికి సమర్పించే నైవేద్యం. కొత్త మట్టి లేదా రాగి కుండలో అన్నం, పాలు, బెల్లం వండుతారు. ఆ కుండను వేప ఆకులు, పసుపు, కుంకుమతో అలంకరిస్తారు అని అన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

- హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి ఆగస్టు 7 మహా :** యువజన కాంగ్రెస్ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఏర్పాటు చేసిన మెఘా ఉచిత వైద్య శిబిరానికి ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు నీలాద్రి హాస్పటల్, హయత్ నగర్, అభినవ్ కంటి దవాఖాన మేడిపల్లి వారిచే స్థానిక దివ్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించిన కౌన్సిలర్ విఘ్నేష్ ని అలాగే ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న హాస్పటల్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు. భువనగిరి పట్టణంలో మరో కార్యక్రమంలో స్కూల్ పిల్లలకు నోట్ బుక్స్ బ్యాగ్స్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి రవికుమార్ , వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేద్ చిస్తి, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, చల్ల కిషోర్, భుషపాక మనీష్, ప్రమోద్, శివ, కోళ్ల ప్రవీణ్, శివతేజ, రాకేష్, సంతోష్తోట కార్తీక్, రాజు, దినేష్, వంశీ, వడ్లకొండ శివ, మహేందర్, సాదిక్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్ ఎందుకు చేయలేదు?

**బీర్ల ఐలయ్యకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రశ్న**



**ఆలేరు ఆగస్టు 7 మహా :** ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ చేస్తామని వాగ్దానం చేసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎలక్షన్లు అయిపోయి 1000 రోజులైనా ఇప్పటివరకు రెవెన్యూ డివిజన్ ఎందుకు చేయలేదో చెప్పాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రశ్నించారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు... గత ప్రభుత్వ హాయంలోనే ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని అభివృద్ధిని చేసింది తానేనని ఆమె వివరించారు బీర్ల అయిలయ్య సత్య దూరమైన మాటలు మాట్లాడుతూ ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు ఆమె ఆరోపించారు.... గత ప్రభుత్వంలోని సాగునీరు, త్రాగునీరు, రోడ్లు, సిసి రోడ్లు, చెక్ డ్యాములు, విద్య వైద్య రంగాల్లో ఆలేరును గణనీయంగా అభివృద్ధి చేసినట్లు ఆమె వివరించారు. ఆలేరు అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆమె సవాలు విసిరారు... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటే ఎక్కువ అబద్ధాలు ఆడేది బీర్ల ఐలయ్యేనని ఆమె ఎద్దేవా చేశారు... గురిగింజల మాట్లాడొద్దని ఏమి అభివృద్ధి చేశావు చెప్పాలని ఆమె అన్నారు అభివృద్ధి చేస్తే సహకరిస్తామని మా సూచనలు సలహాలు కూడా ఇస్తామని అన్నారు ఇప్పటివరకు ఆలయంలో ఏ విధంగా అభివృద్ధి చేయలేదని ఆమె వివరించారు... విలేకరుల సమావేశంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్లు పాకాల మౌనిక, బీజన కళ్యాణి, కొలనుపాక సర్పంచ్ యాకమ్మ, నాయకులు పంతం కృష్ణ, జల్లి నరసింహులు, గుండె సంపత్, బింగి రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలే కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లు

- "సహచరి"ప్రతి ఇంటికి జీవన దీపం... రక్షా కవచం.
- అడిషనల్ డీసీపీ ఎన్. నర్సింహారెడ్డి (ఎస్ఓటి)

**కుషాయిగూడ, మహా :** స్వయం సహాయక సంఘాల సభ్యులకు కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడమే పోలీసుల ప్రధాన ధ్యేయమని అడిషనల్ డీసీపీ ఎన్. నరసింహారెడ్డి పేర్కొన్నారు. కీసర సర్కిల్ జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సూచనతో శుక్రవారం సహచరి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ ఎం నరసింహారెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలు పిల్లల వృద్ధులు భద్రత నేరాల నివారణ ట్రాఫిక్ భద్రత సైబర్ భద్రత మాదక ద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి పోలీస్ ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. చట్టం అనేది సమాజంలో శాంతిభద్రతలు, న్యాయం, క్రమశిక్షణ నెలకొల్పేందుకు ప్రభుత్వం రూపొందించిన నియమావళి అన్నారు. చట్టం దృష్టిలో ప్రతి పౌరుడు సమానుడు. చట్టానికి కులం, మతం,వర్గం, లింగం, ఆర్థిక బేధం లేవని తెలిపారు. ప్రతి వ్యక్తికి చట్టం పట్ల సమానమైన నియమాలు వర్తిస్తాయని తెలిపారు. 2024 నుండి అమలులోకి వచ్చిన భారతీయ నూతన క్రిమినల్ చట్టాలు దేశంలోని న్యాయవ్యవస్థను మరింత ఆధునికంగా పారదర్శకంగా సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో రూపొందించబడ్డాయని తెలిపారు. అలాగే పోలీస్ స్టేషన్ అనేది ప్రజలకు చట్టపరమైన రక్షణ భద్రత న్యాయం అందించే ప్రభుత్వ సంస్థ అని భారత రాజ్యాంగం భారత న్యాయ సంహిత భారత నాగరిక సురక్ష సంహిత భారతీయ సాక్ష్యం అదినీయం ఇతర చట్టాల ప్రకారం పోలీస్ స్టేషన్ పోలీసులు తమ విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు.

# ఉచిత శిక్షణ ఏర్పాట్లను పరిశీలించిన అభిషేక్ రెడ్డి

- పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణకు ఏర్పాట్లు షురూ...
- ఈ నెల 9న ప్రారంభం కానున్న దరఖాస్తుల స్వీకరణ...
- అభ్యర్థులంతా అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపు



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 7 మహా:** ఎంఆర్ఆర్ ఫౌండేషన్, "మల్ రెడ్డి యువశక్తి" నేతృత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9న ఆదివారం దరఖాస్తుల స్వీకరణ మొదలుకానున్న నేపథ్యంలో, బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మల్ రెడ్డి యువశక్తి సారథి అభిషేక్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. మంచాల రోడ్డులోని భారత్ గార్డెన్ నుంచి సాగర్ రోడ్డు వరకు ఇటీవల ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో నూతనంగా నిర్మించిన బైపాస్ ఎంట్రెన్స్ వద్ద దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరగనుండగా... అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పనపై నాయకులతో చర్చించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సజావుగా జరిగేలా కౌంటర్ల ఏర్పాటు, అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్వచ్ఛంద కార్యకర్తల నియామకం, పార్కింగ్, తదితర అంశాలపై అభిషేక్ రెడ్డి సమీక్ష నిర్వహించి, నాయకులకు పలు సూచనలు చేశారు.

**కొనసాగనున్న దరఖాస్తుల స్వీకరణ...**

పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు ఈ నెల 9న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై... 15వ తేదీ వరకు కొనసాగుతుందని అభిషేక్ తెలిపారు. అనంతరం, పరిస్థితులను బట్టి పొడిగింపు నిర్ణయం ఉంటుందని చెప్పారు. ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ లో 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

**విజయానికి ముందడుగేయండి...**

పోలీస్ కావాలనే వారి లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని, తమ వంతు సహకారంగా ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పెరుగుతున్న పోటీ, సిలబస్ ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభించాలని ఆయన సూచించారు. రాజకీయ నిరుద్యోగుల ట్రాప్ లో పడకుండా తల్లిదండ్రుల కలలు సాకారం చేసే దిశగా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఇందుకు తాము అండగా ఉంటామని చెప్పారు. నోటిఫికేషన్, పోస్టుల విషయంలో ఆందోళన చెందకుండా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, దారు రాఘవేందర్, రాందాస్, ఇందూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రశాంత్, మంకాల దాసు, మహిళా నాయకురాలు జయమ్మ, ఏఎంసి వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, డైరెక్టర్లు తాళ మహేష్ గౌడ్, సుబ్బురు మల్లికా పాండు, మడుపు సాయికుమార్, అయాన్ పటేల్, భరత్ రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు 'సహచరి' అవగాహన కార్యక్రమం

**కుషాయిగూడ, మహా :** మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 'సహచరి' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సీడబ్ల్యూడీ సహకారంతో హెచ్‌బీ కాలనీలోని రాజీవ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సుమారు 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వారు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ఎన్. వెంకన్న, ఎన్. సుధాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ పనితీరు, మహిళల ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కార విధానం, మహిళలకు సంబంధించిన కేసుల దర్యాప్తు ప్రక్రియపై వివరించారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలు, అత్యవసర సహాయం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.మహిళలు తమపై జరిగే వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు లేదా ఇతర సమస్యలను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు పోలీసుల సహాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నిర్వహించిన ప్రశ్నోత్తరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను




నివృత్తి చేసుకున్నారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వారు అభినందించారు.



# ఆగస్టు 7 నుంచి 29 వరకు పాఠశాలల్లో నిరసనలు

- ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై స్టీరింగ్ కమిటీ సమావేశం
- దశలవారీ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు

**మందమర్రి, మహా :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 7 నుంచి 29 వరకు పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలను చేస్తున్నట్లు టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు పోడేటి సంజీవ్, దేవ రమేష్ లు తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల కమిటీ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి తాము విధులకు నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసనలు, పీటీసీ ప్రకటించేదాకా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్రంలో ఉన్న సంఘాలు అందరం ఏకతాటిపైకి వచ్చామని చెప్పారు. అందులో భాగంగా దశల వారి ఉద్యమాలు చేయాలని తీర్మానించుకున్నామని వెల్లడించారు. అందులో భాగంగా నేటి నుండి ఆగస్టు 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా దశల వారి ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆగస్టు 12, 13 లలో ప్రతి మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలతో పాటు తాసిల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆగస్టు 19 నాటి నుండి జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు, పీటీసీ ప్రకటించేదాకా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 21 నుంచి 26 వరకు రాష్ట్ర, జిల్లా బృందాల పర్యటన, జిల్లా కేంద్రాల్లో ప్రెస్ మీట్లు ఉంటాయని అన్నారు. చివరిగా ఆగస్టు 29 ఇందిరా పార్క్ లో మహా ధర్నలో రాష్ట్ర స్థాయి మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పి.ఆర్.సి. నివేదికను వెంటనే ప్రకటించకుని అమలు చేయాలి వారు డిమాండ్ చేశారు. జిఓ 25 సవరించాలి ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులకు ఒక టీచర్ ను నియమించాలని కోరారు.

అంతేకాకుండా బదిలీలు, పదోన్నతులు ఆగస్టు 15 లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వీసు నిబంధనలు (పి.ఓ.2018) రూపొందించి, పర్యవేక్షణ అధికారులు పోస్టులు భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఇకపోతే డిజిఓ, డిప్యూటీ ఇన్‌చి, ఎంజిఓ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. టెట్ లో సహ వేయిటేజ్ ఇవ్వాలి, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని చెప్పారు. ఈ పోరాటాన్ని బలపరిచేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రతిరోజు నిర్వహించే ఉద్యమ స్వరూపాలలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి అనురాధ, ఎం సునీత దేవి, కె విజయలక్ష్మి ఉన్నారు.



# తల్లి పాలే శిశువుకు పౌష్టికాహారం

- అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, బ్యూరో మహా;** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ ప్రాజెక్టు లక్ష్మీ నగర్ సెక్టార్ పరిధిలోని విద్యానగర్ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమంతో పాటు చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.బాలికల భవిష్యత్ విద్య, ఉన్నత చదువులు, వివాహ అవసరాలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబం తమ కుమార్తెల పేరిట సుకన్య సమృద్ధి యోజన ఖాతాను ప్రారంభించి, క్రమం తప్పకుండా పొదుపు చేయాలని సూచించారు. బాలికల భవిష్యత్ భద్రతకు ఈ పథకం మంచి పెట్టుబడిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిశువుకు పుట్టిన వెంటనే మొదటి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు పరిపూరక ఆహారాన్ని ప్రారంభించాలని తల్లులకు సూచించారు. రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు అందించడం ద్వారా శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి. రాజమణి మాట్లాడుతూ, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యతో పాటు ఆటల ద్వారా నేర్చుకునే విధానం, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. చిన్ననాటి నుంచే ఆటల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని అధికారులు వివరించారు. ఆటలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విద్య, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

**కుషాయిగూడ, మహా :** పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన కేసులో ముగ్గురు నిందితులను జవహర్ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు, ఎస్ఐ రాము, తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు ఎం.సుధీర్ కుమార్ (28), గార్డెనర్‌గా పనిచేస్తూ యాప్రాల్‌లోని భగత్ సింగ్ నగర్‌లో నివాసముంటున్నాడు. నిందితుడు సందీప్ కుమార్ అలియాస్ కుట్టన్‌తో సుధీర్ కుమార్‌కు గతంలో వివాదాలు ఉన్నాయి.ఈ నెల 06వ తేదీన మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో సుధీర్ కుమార్ తన సోదరుడు దీపక్‌తో కలిసి యాప్రాల్‌లోని ఆదిత్య వైన్స్ వద్ద ఉన్నాడు. ఆ విషయాన్ని నిందితుడు సందీప్ కుమార్ స్నేహితులైన ఎస్. వివేక్, వి. సుమిత్ రాఘవన్ గమనించి సందీప్‌కు సమాచారం అందించారు. వెంటనే సందీప్ కుమార్ ఇనుప రాడ్‌తో అక్కడికి చేరుకుని, సుధీర్ కుమార్‌ను చంపాలనే ఉద్దేశంతో అతని తలపై పదేపదే కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ నేరంలో మిగతా ఇద్దరు కూడా అతనికి సహకరించారు.దర్యాప్తు నిందితుల అరెస్ట్:తీవ్రంగా గాయపడిన సుధీర్ కుమార్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, జవహర్ నగర్ పోలీసులు ఆస్పత్రిలో అతని వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సబ్‌ఇన్స్పెక్టర్ బి. రాము



దర్యాప్తు చేపట్టారు.నిందితులు పరారవుతుండగా యాప్రాల్ ఎక్స్ రోడ్స్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితుల సమాచారం మేరకు సంఘటనాస్థలం పక్కన దాచిపెట్టిన 30 అంగుళాల పొడవున్న ఇనుప రాడ్‌ను కేసు ఆధారంగా సిసిటివి ఫుటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:**

ఏ 1: సందీప్ కుమార్ అలియాస్ కుట్టన్ (27), వృత్తి: డ్రైవర్, నివాసం: యాప్రాల్

ఏ 2: ఎస్. వివేక్ (38), వృత్తి: వెల్డింగ్ వ్యాపారం, నివాసం: యాప్రాల్

ఏ 3: వి. సుమిత్ రాఘవన్ (26), వృత్తి: టాటూ వ్యాపారం, నివాసం: యాప్రాల్

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జవహర్ నగర్ సీఐ ఎస్. సైదులు, ఎస్ఐ బి. రాము వారి సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసినట్లు జవహర్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చక్రపాణి తెలిపారు.




# పోలీస్ మీకోసం..

**ఆదిలాబాద్ మహా :** ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం కోసం పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నేరేడిగొండ మండలం వాగ్దేరి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నిష్ణాతులైన ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో దాదాపు 800 మంది ప్రజలకు ఆర్థోపెడిక్, డెంటల్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ సందర్భంగా నేరేడిగొండ మండల కేంద్రం తో పాటు తర్ణం గ్రామాల్లో ఏర్పాటు చేసిన 12 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ప్రతి గ్రామం సీసీటీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, నేరస్థులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించవద్దని సూచించారు. గ్రామాల్లో హెల్మెట్ లేనిదే ద్విచక్ర వాహనాలను అనుమతించకుండా ప్రజలే చొరవ చూపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తున్న 20 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి అభినందించారు.గంజాయి, గుడుంబా వంటి మాదక వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి పండించడం, నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం, సేవించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా సంబంధిత శాఖలకు సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం గత రెండు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు జిల్లా ఎస్పీ నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేసి అభినందించారు. పెయింటింగ్ పోటీల్లో విజేతలైన చిన్నారులకు కూడా ఎస్పీ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, నేరేడిగొండ ఎస్ఐ ఇమ్రాన్, వాగ్దేరి గ్రామ సర్పంచ్ జాదవ్ విజయ్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, చిన్నారులు, వైద్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ పోషకాహారం

- ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం

**క్యాతనపల్లి -మహా :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణీలు, బాలింతలు, ఆస్పత్రి మహిళా సిబ్బందికి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మందమరి ఏరియా జీఎం రాధాకృష్ణ, సీఎంఓ డా. కిరణ్ రాజ్ ఆదేశాల మేరకు, ఏరియా ఆస్పత్రి డిప్యూటీ సీఎంఓ డా. మధు కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డా. లలిత మాట్లాడుతూ.. శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఓ మదార్ సాహెబ్, మ్యాట్రన్ టీ.వీ. విజయలక్ష్మి, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సహకార సంఘాల్లో రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలి

**రాజేంద్రనగర్, ఆగస్టు 7 (మహా):** శంషాబాద్ మండలం మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ శుక్రవారం అధ్యక్షుడు మేకల ప్రభు సాగర్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.సంఘంలో అవినీతి జరిగిందనే అనుమానంతో సహకార చట్టం సెక్షన్52 కింద విచారణ కోరినట్లు ప్రభు సాగర్ తెలిపారు. విచారణలో రూ.17.50 లక్షల అక్రమాలు జరిగినట్లు తేలిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. తాను బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే సంఘానికి రూ.50 లక్షల మిగులు సాధించామని తెలిపారు. రైతులు సంఘం లావాదేవీలు, రుణాలపై అవగాహన పెంచుకుని అధికారులను ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని సూచించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరిగిందని, రాజకీయ నా





యకులను సొసైటీ ఎన్నికలకు దూరంగా ఉంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే సహకార సంఘాల ఉనికే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. రైతులు మాట్లాడుతూ ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో సరైన సమాచారం ఇవ్వడం లేదని, రైతులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సేవే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని కోరారు.

# సిఎంఆర్ బియ్యం పంపిణీ

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు
- మంచిర్యాల, మహా : జిల్లాలో సిఎంఆర్ బియ్యం పంపిణీ
- నిర్దేశిత సమయంలో ఇవ్వాలని

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)** వి రాములు అన్నారు. శుక్రవారం జిల్లాకలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎ.సి.ఎస్.ఓ. లతో కలిసి రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, జిల్లాలో సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలలో వెనుకబడిన రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ లక్ష్య సాధనలో వెనుకబడిన రైస్ మిల్లర్లు సిఎంఆర్ డెలివరీలను వేగవంతం చేసి, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సిఎంఆర్ డెలివరీలలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పని చేయాలని వెల్లడించారు. నిర్ణీత గడువులోగా సిఎంఆర్ బియ్యం డెలివరీలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పై ఎమ్మెల్యే నాయిని సమీక్ష

**హనుమకొండ, మహా:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుడా కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల కింద చేపట్టిన పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, అధికారులను అడిగి తెలుసుకుని, పనులను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా పనుల పై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఈనెల 10న కలెక్టరేట్ వద్ద జైల్ భరో.!

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 7 మహా:** కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా దేశ సంపదను కట్టబెడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా, నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో, ఈ నెల 10న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక వర్గం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కోరుతూ, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, తొర్రూర్ తుర్కయంజాల్ డివిజన్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించడం జరిగింది. అనంతరం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ మాట్లాడుతూ... ఆగస్టు 10వ తేదీన జరిగే దేశవ్యాప్త పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె అరుణ్ కుమార్ కార్మికులు మొలుగు కృష్ణ, నార్ల కంటి సాలయ్య, కందాల రవి, వెంకట్ రెడ్డి, గోపాల్, ఎకోస్వామి, మేతరి సంతోష్, పరమేష్, కమలాకర్, ఆమీర్ భాయ్, కృష్ణ, సురేష్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు తోనే రైతులకు మేలు

- 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- మండల ప్రజావాణిని ప్రతివారం నిర్వహించాలి
- వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, బ్యూరో మహా :** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద డిఎఫ్ఓ నిఖిత తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సాగునీటి విడుదల పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి
జల వనరులను నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరా పైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి**

ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కంది, పెసర, మినుములు తదితర పప్పు ధాన్యాల విత్తనాలను సమృద్ధిగా నిల్వ ఉంచామని, ఇప్పటికే రైతులకు పంపిణీ ప్రారంభించామని మంత్రి తెలిపారు.

**1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, కొత్త చేయూత పెన్షన్ల అర్హుల జాబితా ను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**జిల్లాలో ఇప్పటి వరకు 1,94,435**

ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, సంబంధిత శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ**

నిపుణుల అంచనాల ప్రకారం వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశమున్నందున కంటింజెన్సీ ప్రణాళికలు, పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి సాగులో కనీసం 50 శాతం విస్తీర్ణాన్ని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసి నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ఈ కాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఫాం పాండ్స్, ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు.



## ఈవీఎం భద్రపరిచే గదిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం భద్రపరిచే గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూమ్‌లో చేపడుతున్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పై ఎమ్మెల్యే నాయిని సమీక్ష

**హనుమకొండ, మహా ;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుడా కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల కింద చేపట్టిన పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, అధికారులను అడిగి తెలుసుకుని, పనులను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా పనుల పై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో సీనియర్ల కే మొదటి ప్రాధాన్యత

- 60 శాతం నామినేటెడ్ పోస్టులు వారికే
- పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలకు న్యాయం
- వర్ధన్నపేట పరిధిలో 1, 65, 66 డివిజన్లకు ప్రత్యేక ఇంచార్జ్ ల నియామకం
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**హనుమకొండ, మహా ;** ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కష్టకాలం లోనూ కాంగ్రెస్ జెండాను మోసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు రానున్న నామినేటెడ్ పదవుల్లో 60 శాతం ప్రాధాన్యం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించడం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. మాజీ మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు ప్యాక్స్ డైరెక్టర్లు, చైర్మన్లు, మార్కెట్ కమిటీలు తదితర నామినేటెడ్ పదవుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నిజమైన పార్టీ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

**అందరి సమన్వయం తోనే తుది జాబితా***

ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ అభ్యర్థులు, సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుని ఆశావహుల తుది జాబితా రూపొందించేలా అధిష్ఠానం స్పష్టమైన విధివిధానాలు రూపొందించిందన్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తల త్యాగాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న ఏఐసీసీ ప్రతినిధి మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

***డివిజన్ కమిటీల ఏర్పాటుకు ప్రత్యేక ఇంచార్జ్ లు***

టీపీసీసీ ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1, 65, 66 డివిజన్లలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఇంచార్జ్ లను నియమించినట్లు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రకటించారు. ఈ బాధ్యతలను డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, డీసీసీ జనరల్ సెక్రటరీలు బిన్ని లక్ష్మణ్, మారంరెడ్డి కౌశిల్ రెడ్డి, డీసీసీ సెక్రటరీలు కట్ట రఘుపాల్ రెడ్డి, ముక్కెర సురేష్, కొక్కిరాల స్వాతి, డీసీసీ ఈసీ సభ్యుడు కొత్త వాసుదేవ రెడ్డికి అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన ఇంచార్జ్‌లు వెంటనే క్షేత్రస్థాయిలో పనిచేస్తూ స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని నిర్దేశిత గడువులోగా డివిజన్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, సీనియర్ నాయకులకు తగిన గౌరవం కల్పించడం అనే రెండు లక్ష్యాలతో కాంగ్రెస్ అధిష్ఠానం ముందుకు సాగుతోందని, ఈ నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపి పార్టీని మరింత బలోపేతం చేస్తాయని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

## అమ్మవారి ఆలయాల రహదారులు బాగు చేయాలని వినతి

**రాజేంద్రనగర్, ఆగస్టు 7 (మహా):** బోనాల పండుగ నేపథ్యంలో కాటేదాన్ డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయాలకు వెళ్లే రహదారులను మరమ్మతు చేయడంతో పాటు వీధి దీపాలను సరిచేయాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రగతి కాలనీ, బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్, మోహన్ రెడ్డి నగర్, సాయిబాబా నగర్, బుద్వేల్, నేతాజీ నగర్ ప్రాంతాల్లో ఆలయాలకు వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయని, వీధి దీపాలు కూడా సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. బోనాలు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు ఈ మార్గాల్లో ప్రయాణిస్తారని, ప్రమాదాలు జరగకుండా వెంటనే రహదారుల మరమ్మతులు చేపట్టి, వీధి దీపాలను పునరుద్ధరించాలని కమిషనర్‌ను కోరారు.

# ప్రజా సేవే పరమావధిగా... ఆపదలో అండగా బీర్ల అనిత

**బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం**

**యాదగిరిగుట్ట ఆగస్ట్ 7 మహా:** ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత జన్మదినం సందర్భంగా ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక కథనం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణిగా, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బీర్ల అనిత ప్రజా సేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. బీర్ల అయిలయ్య చేపడుతున్న ప్రజా సేవా కార్యక్రమాలకు తోడుగా నిలుస్తూ, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా...ఆలేరు నియోజకవర్గంలో ఎక్కడ పేద కుటుంబం ఆపదలో ఉందని తెలిసినా స్పందిస్తూ వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారి కుటుంబానికి తక్షణ అవసరంగా ఉండేలా క్వింటాల్ బియ్యం అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక చేయూత ఆర్థిక ఇబ్బందులతో తమ ఆడబిడ్డల వివాహాలను నిర్వహించలేని నిరుపేద కుటుంబాలకు బీర్ల అనిత అండగా నిలుస్తున్నారు. పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక కానుకలు అందిస్తూ, వారి కుటుంబాల్లో సంతోషం నింపుతున్నారు. ఒక కుటుంబానికి వివాహం అనేది జీవితంలో ముఖ్యమైన ఘట్టమని గుర్తించి, ఆ సమయంలో అండగా నిలవడం ద్వారా తన సేవాభావాన్ని చాటుతున్నారు.

**ఉచిత అంబులెన్స్ సేవలు...**

ఆపదలో ప్రాణరక్షకంగా అత్యవసర పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్ అవసరమైన వారికి సహాయం అందిస్తూ, అనేక కుటుంబాలకు ప్రాణరక్షణలో కీలకంగా నిలుస్తున్నారు.

**ఉన్నత విద్యకు చేయూత**

పేదరికం కారణంగా ఉన్నత చదువులు కొనసాగించలేని విద్యార్థులకు సైతం బీర్ల అనిత అండగా నిలుస్తున్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే పరిస్థితి రాకుండా విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తూ వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందిస్తున్నారు.





**ప్రజల కష్టమే... తన బాధ్యతగా**

బీర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న బీర్ల అనిత, ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో విషాదం, విద్య, వివాహం వంటి సందర్భాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉండాలి... అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించాలి అనే భావనతో బీర్ల ఫౌండేషన్ సేవలను ముందుకు తీసుకెళ్తున్నారు. సేవా స్ఫూర్తికి ప్రతిరూపంగా...బీర్ల అనిత చేపడుతున్న సేవా కార్యక్రమాలు కేవలం సహాయం అందించడానికే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న కుటుంబాలకు మానసిక ధైర్యాన్ని, నిరుపేదలకు భరోసాను, విద్యార్థులకు భవిష్యత్తుపై నమ్మకాన్ని కల్పించేలా కొనసాగుతున్నాయి. బీర్ల అయిలయ్య ప్రజా సేవా కార్యక్రమాలకు తోడుగా నిలుస్తూ, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ "ప్రజల కోసం... ప్రజల మధ్యనే" అనే సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతున్న బీర్ల అనితకు ఆలేరు నియోజకవర్గ ప్రజల నుంచి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. బీర్ల అనిత జన్మదినం సందర్భంగా ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, మరింత కాలం ప్రజలకు సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షిద్దాం.



## ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యం



**ఘట్‌కేసర్, ఆగస్టు 7 (మహా):** ఘట్‌కేసర్‌లోని కృష్ణ మార్ట్‌లో పనిచేస్తున్న 20 ఏళ్ల రోషిణి అస్తానే కనిపించకుండా పోయింది. ఆగస్టు 6 ఉదయం విధులకు వెళ్లిన ఆమె రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తల్లి అనిత అస్తానే ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోషిణి ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ లేదా 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

- హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ మహా ;హనుమకొండ జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో కార్డుల పంపిణీకి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 14 మండలాలకు మొత్తం 2,56,838 స్మార్ట్ రేషన్ కార్డులు అందినట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా ఆత్మకూరు 11,641, భీమదేవరపల్లి 15,783, దామెర 9,264, ధర్మసాగర్ 17,069, ఎల్కతుర్తి 14,055, హనుమకొండ 44,283, హసన్‌పర్తి 26,220, ఐనవోలు 15,389, కమలాపూర్ 22,095, కాజీపేట 30,959, నడికూడ 11,658, పరకాల 14,714, శాయంపేట 14,884, వేలేరు 8,824 కార్డులు వచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు కార్డులు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రతి మండలానికి నోడల్ అధికారులను నియమించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, పౌరసరఫరాల శాఖ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో ఫోర్జరీ కలకలం!

**ఉప సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన సర్పంచ్ భర్త**

**మహబూబాబాద్, మహా;** మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల పెత్తనం మితిమీరిపోవడమే కాకుండా, ఏకంగా ఫోర్జరీ సంతకాలకు ఒడిగడుతుండటం స్థానికంగా కలకలం రేపుతోంది. మొన్న డోర్నకల్ పరిధిలోని గిరిపురం పంచాయతీ నిధుల దుర్వినియోగం, నిన్న గూడూరు మండలం గుండెంగ లో సర్పంచ్ కుమారుడి ఫోర్జరీ సంతకాల ఉదంతాలు మరువకముందే తాజాగా కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామపంచాయతీలో మరో ఫోర్జరీ వ్యవహారం వెలుగుచూసింది. రామన్నగూడెం పంచాయతీకి సంబంధించిన ఒక ముఖ్యమైన రికార్డుపై ఉప సర్పంచ్ కు తెలియకుండానే, ఆయన సంతకాన్ని సర్పంచ్ భర్త ఫోర్జరీ చేసి అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. పరిశీలన సమయంలో అధికారులకు అనుమానం రావడంతో ఈ ఉదంతం బయటపడింది. విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ అధికారులను నిలదీయడంతో సర్పంచ్ భర్త వెనక్కి తగ్గక తప్పలేదు. అనంతరం కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమక్షంలోనే ఉప సర్పంచ్‌చేత మళ్లీ అసలైన సంతకాలు చేయించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### మలయాళ చిత్రసీమలో

# తనదైన ముద్ర వేసిన మాళవిక మీనన్

కేరళలోని కొడుంగల్లూరులో జన్మించిన మాళవిక మీనన్ మలయాళ చిత్రసీమలో ప్రతిభావంతమైన నటిగా గుర్తింపు పొందారు. చిన్న వయసులోనే సినీ రంగంలో అడుగుపెట్టి, సహజమైన నటనతో ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నారు. పాత్ర చిన్నదైనా, పెద్దదైనా తనదైన అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడం ఆమె ప్రత్యేకత.2012లో విడుదలైన మలయాళ రొమాంటిక్ థ్రిల్లర్ 'నిద్ర' చిత్రంలో రేవతి పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన మాళవిక, అదే ఏడాది 'హీరో' చిత్రంలోనూ నటించారు. అనంతరం '916' చిత్రంలో కథానాయికగా కనిపించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి చిత్రాల నుంచే తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.ఆ తర్వాత మలయాళ చిత్రసీమలో వరుస అవకాశాలను అందిపుచ్చుకున్న ఆమె, 'జోసెఫ్' (2018), 'కడువా' (2022) లో మేరీ పాత్ర, 'పాపన్' (2022), 'కురుక్కన్' (2023), 'తంకమణి' (2024) వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. సహాయ పాత్రల్లోనూ తన నటనతో ప్రత్యేక ముద్ర వేశారు. మలయాళంతో పాటు తమిళ చిత్రసీమలోనూ మాళవిక తన ప్రతిభను చాటుకున్నారు. 'విజా' (2013), 'పేయ్ మామా' (2021) వంటి తమిళ చిత్రాల్లో నటించి అక్కడి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన నటనా ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు.a2025లో మమ్ముట్టి ప్రధాన పాత్రలో వచ్చిన 'కలంకావల్' చిత్రంలో బబిత పాత్రలో కనిపించిన మాళవిక మరోసారి తన నటనతో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'పదమూడో రాత్రి', 'ఒరు వడక్కన్ తేరోట్టం', 'సీక్రెట్ ఆఫ్ కళింగ' (2026) వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.సహజమైన అభినయం, విభిన్న పాత్రల్లో ఒదిగిపోయే నైపుణ్యం, ప్రేక్షకులను ఆకట్టుకునే తెరపై హావభావాలతో మాళవిక మీనన్ దక్షిణ భారత చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు ఆమె సిద్ధంగా ఉన్నారు.



### గ్లామర్‌తో పాటు నటనతో ఆకట్టుకుంటున్న

# శోభిత రాణా

పంజాబ్‌కు చెందిన నటి, మోడల్ శోభిత రాణా తన అందం, అభినయం, స్టైలిష్ వ్యక్తిత్వంతో వినోద రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, అనంతరం పంజాబీ, తెలుగు, హిందీ, కన్నడ చిత్రాల్లో నటిస్తూ బహుభాషా నటిగా గుర్తింపు పొందారు.చండీగఢ్‌లో రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించిన శోభిత రాణా ఫ్యాషన్ డిజైన్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. సినీ రంగంలోకి రాకముందు మోడల్‌గా అనేక ప్రకటనల్లో నటించారు. అలాగే 'నా హీరే నూ సతా' వంటి ప్రముఖ పంజాబీ సంగీత ఆల్బమ్‌లలో కనిపించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.2014లో విడుదలైన పంజాబీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఇష్క్ బ్రాండీ' ద్వారా కథానాయికగా సినీ అరంగేట్రం చేశారు. అనంతరం 'కెనడా ది ఫ్లైట్', 'గొల్లూ ఔర్ పప్పూ' చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నారు.తెలుగు ప్రేక్షకులకు 'రాజా మీరు కేక' చిత్రంతో పరిచయమైన శోభిత, తర్వాత 'రంగ రంగ వైభవంగా' సినిమాలో కీలక పాత్రలో కనిపించారు. అలాగే కన్నడ చిత్రం 'షాడో', హిందీ చిత్రం 'రామ్‌రాజ్య'లో కూడా నటించి విభిన్న భాషల్లో తన సత్తా చాటారు. సినిమాలతో పాటు సంగీత వీడియోల్లోనూ ఆమెకు మంచి ఆదరణ లభించింది. 'కాలీ మేరీ గుట్', 'మహియా' వంటి పాపులర్ మ్యూజిక్ వీడియోల్లో నటించి యువతను ఆకట్టుకున్నారు. సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉంటూ తన ఫోటోషూట్లు, ఫ్యాషన్ అప్‌డేట్స్, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ భారీ అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు.ప్రస్తుతం శోభిత రాణా మోడలింగ్, ఫ్యాషన్ కార్యక్రమాలు, డిజిటల్ వేదికలపై చురుకుగా కొనసాగుతున్నారు. కొత్త చిత్రాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తూ, మంచి కథలు, విభిన్న పాత్రలకు ప్రాధాన్యం ఇస్తూ తన సినీ ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.




# నెట్‌ఫ్లిక్స్‌లో రణ్‌వీర్ సింగ్ చిత్రానికి ప్రపంచవ్యాప్త ఆదరణ

ాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అంతర్జాతీయ ...యిలో విశేష ఆదరణ పొందినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ ఏడాది అత్య...కంగా వీక్షించబడిన నాన్‌ఇంగ్లీష్ చిత్రాల్లో ఇది అగ్రస్థానంలో నిలిచినట్లు నెట్‌ఫ్లిక్స్ సహసీఈవో ...ెడ్ సరాండోస్ వెల్లడించారు. 2026 జనవరి నుంచి జూన్ వరకు ఈ చిత్రానికి సుమారు 3.7 కోట్ల వీక్షణలు నమోదైనట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రపంచంలోని 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ ...టెండింగ్ జాబితాలో ఈ సినిమా మొదటి స్థానాన్ని దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కూడా భారీ విజయాన్ని అందుకుంది. తొలి భాగం మంచి విజయాన్ని నమోదు చేయగా, అనంతరం విడుదలైన 'ధురంధర్: ది రివెంజ్' కూడా ప్రేక్షకుల ఆదరణతో వసూళ్ల పరంగా కొత్త మైలురాళ్లు నెలకొల్పినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ సందర్భంగా టెడ్ సరాండోస్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాలు, వెబ్ సిరీస్‌లకు ఆదరణ గణనీయంగా పెరుగుతోందన్నారు. గత కొంతకాలంగా ప్రతి వారం ఏదో ఒక భారతీయ కంటెంట్ నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్10 జాబితాలో చోటు దక్కించుకుంటోందని, భారతీయ కథలకు ప్రపంచ ప్రేక్షకులు మరింతగా ఆకర్షితులవుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.



# సినీ పరిశ్రమకు ఏపీ సర్కార్ ప్రోత్సాహం

ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోంది. ఈ దిశగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అధ్యక్షతన ఏపీ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ భరత్ భూషణ్, మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథన్, పలు శాఖల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. సినిమా షూటింగ్‌లకు అవసరమైన అనుమతులను ఒకే వేదికపై వేగంగా అందించే 'సింగిల్ విండో' విధానాన్ని అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్మాతలకు ఇబ్బందులు లేకుండా ఫాస్ట్‌ట్రాక్ విధానంలో అనుమతులు జారీ చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే రాష్ట్రంలో మరిన్ని చిత్రీకరణలు జరిగే అవకాశం ఉంటుందని, సినీ పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్ మరింత అనుకూల గమ్యస్థానంగా మారుతుందని ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్ తెలిపారు. ఈ విధానానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పలువురు ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యదర్శులు, అటవీ, పర్యాటక, రెవెన్యూ, పోలీసు తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### త్రివిక్రమ్–ఎన్టీఆర్ కాంబోలో

# మరో భారీ చిత్రం?

'అరవింద సమేత వీరరాఘవ' విజయానంతరం జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మరోసారి చేతులు కలపనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి తాత్కాలికంగా 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ చిత్రం పురాణ గాథల ఆధారంగా రూపొందే భారీ మైథలాజికల్ యాక్షన్ డ్రామాగా ఉండొచ్చని సమాచారం. సుబ్రహ్మణ్య స్వామి కథకు ప్రేరణగా కథను రూపొందిస్తున్నారని, ఇందులో ఎన్టీఆర్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపించే అవకాశముందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. త్రివిక్రమ్ శైలిలోని సంభాషణలు, ఎన్టీఆర్ నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని అంటున్నారు.ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కథ, విజువల్ డిజైన్, సాంకేతిక అంశాలపై ప్రణాళికలు రూపొందుతున్నట్లు తెలుస్తోంది. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత 2027 రెండో అర్ధంలో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశముందని సమాచారం. ఇక ఎన్టీఆర్ ప్రస్తుతం భుజానికి గాయమైన కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. పూర్తిగా కోలుకున్న అనంతరం ఆయన ముందుగా 'డ్రాగన్' సినిమా చిత్రీకరణను పూర్తి చేసి, ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలోని ఈ కొత్త ప్రాజెక్ట్‌పై దృష్టి సారించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.గమనిక: ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com